**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 83, పేజీలు - 08

సోమవారం, సెప్టెంబర్ 21, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# ఓఆర్ఆర్‌పై వేగం.. ప్రాణాలకు ముప్పు!

**- ఓఆర్ఆర్ ఎక్కితే సురక్షితంగా దిగుతామన్న గ్యారెంటీ లేదా? - అజాగ్రత్త, అతి వేగం నిర్లక్ష్యమే ప్రమాదాలకు ప్రధాన కారణాలు**

**- 9 నెలల్లో 28 ప్రమాదాలు.. 20 మంది మృతి**





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)పై అజాగ్రత్త, అతి వేగం, నిర్లక్ష్యం వరుస ప్రమాదాలకు కారణమవుతున్నాయి. మేడ్చల్, శామీర్‌పేట, కీసర, ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో సుమారు 35 కిలోమీటర్ల మేర ఓఆర్ఆర్ విస్తరించి ఉంది. ముఖ్యంగా ఎగ్జిట్-9, 7, 6 పరిధుల్లో ఓఆర్ఆర్‌పైకి వచ్చే వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారుల్లో ఆందోళన నెలకొంది.

### వేగానికి తోడు నిర్లక్ష్యం

ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటి వరకు తొమ్మిది నెలల వ్యవధిలో ఓఆర్ఆర్‌పై 28 ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఈ ప్రమాదాల్లో 20 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇటీవల చోటుచేసుకున్న ప్రమాదాలను పరిశీలిస్తే మరమ్మతులకు గురైన వాహనాలను రహదారి పక్కన నిలిపివేయడం కూడా ప్రమాదాలకు కారణమవుతున్నట్లు తెలుస్తోంది. వెనుక నుంచి వేగంగా వస్తున్న వాహనాలు నిలిచి ఉన్న వాహనాలను ఢీకొనడంతో పలువురు మృత్యువాత పడుతున్నారు. మరోవైపు వాహనాలు నడిపే సమయంలో డ్రైవర్లు నిద్రమత్తులోకి జారుకోవడం కూడా ప్రమాదాలకు కారణమవుతోంది.

2లో..

## బీజేపీ అంతర్గత సర్వే

# జెన్ జీతో తెగిన బంధం

**- మోడీ కేబినెట్ ప్రక్షాళనకు బ్రేక్.?**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** కేంద్ర కేబినెట్ ప్రక్షాళనపై గత కొన్ని నెలలుగా చర్చ జరుగుతూనే ఉంది. కానీ ముందడుగు మాత్రం పడటం లేదు. దీని వెనుక చాలా కారణాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా జెన్ జీ నిరసనల తర్వాత దేశంలో మారిన పరిస్థితులు ప్రధాని మోడీని కేబినెట్ ప్రక్షాళనపై తీవ్ర నిర్ణయాలు తీసుకోలేని పరిస్థితి కల్పిస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా బీజేపీ నిర్వహించిన అంతర్గత సర్వేలో కీలక విషయాలు బయటపడినట్లు తెలుస్తోంది. వాటి తర్వాతే కేబినెట్ ప్రక్షాళనపై ప్రధాని మోడీ పునరాలోచనలో పడినట్లు సమాచారం.

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందే కేబినెట్ ప్రక్షాళన చేయాలనుకున్న ప్రధాని మోడీ అప్పట్లో బిజీ షెడ్యూల్ కారణంగా ఆలస్యం చేశారు. అయితే అనూహ్యంగా పార్లమెంట్ సమావేశాల సమయంలోనే జెన్ జీ నిరసనలు మొదలు కావడం,

2లో..

# నేను బహుజనుల బాణాన్ని

**- కొడంగల్ పాంచజన్య సంకల్ప సభలో కవిత**

**- నేను ఎవరి బాణాన్ని కాదు అంటూ కవిత వ్యాఖ్యలు**
**- అధికారానికి దూరంగా ఉన్న బహుజనుల బాణాన్ని నేనని వ్యాఖ్య**
**- యువత, బహుజనుల కోసం ఎవరితోనైనా పోరాడుతానని ప్రకటన**
**- అక్షరాస్యత విషయంలో సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించిన కవిత**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కోస్గి వేదికగా నిర్వహించిన తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పాంచజన్య సంకల్ప సభలో కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్ నియోజకవర్గంలో ఈ సభ నిర్వహించడం కూడా రాజకీయంగా ఆసక్తిని రేకెత్తించింది. కోస్గి జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో జరిగిన సభలో కవిత తన రాజకీయ ప్రయాణం, బహుజన రాజకీయాలపై మాట్లాడటంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. కోస్గి ఎన్నికల ప్రచారానికి సంబంధించిన పాత జ్ఞాపకాలను ఈ సభలో కవిత ప్రస్తావించారు. 2009లో కోస్గి ఎన్నికల ప్రచారంలో తనతో పాటు నారా చంద్రబాబు నాయుడు, రేవంత్‌రెడ్డి కూడా పాల్గొన్నారని ఆమె గుర్తుచేశారు. వారిద్దరూ తర్వాత ముఖ్యమంత్రులు అయ్యారని కవిత చెప్పడంతో సభలో కొద్దిసేపు

2లో..

## క్యూర్ పరిధిలో 21 వేల ఇళ్లు పూర్తి

**- పంపిణీకి ముహూర్తం ఫిక్స్!**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** క్యూర్ పరిధిలో సొంతింటి కల నెరవేర్చుకోవాలని భావించే వారికి తెలంగాణా రెవెన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శుభవార్త చెప్పారు. హైదరాబాద్ చుట్టుపక్కల క్యూర్ పరిధిలోని 26 ప్రాంతాల్లో అసంపూర్తిగా ఉన్న రెండు పడకగదుల ఇళ్ల నిర్మాణం పూర్తి చేశామని ఆయన శుభవార్త చెప్పారు మొత్తం 21 వేల ఇళ్లు సిద్ధమయ్యాయని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఈ ఇళ్లకు లబ్ధిదారులను

2లో..

# గ్రే గ్రోత్ నుంచి గ్రీన్ గ్రోత్ వైపు అడుగులు

**- డీకేతో కలిసి ది ఎర్త్ సెంటర్ ప్రారంభించిన చంద్రబాబు - అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రెండూ ముఖ్యమేనన్న సీఎం**

**- పర్యావరణ హిత నగరంగా అమరావతి నిర్మాణం చేపడతామని వెల్లడి**

**బెంగుళూరు (ప్రశ్న న్యూస్)**ంప్రకృతికి ప్రాధాన్యమిస్తూ, భవిష్యత్ తరాల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి సాగాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. బెంగళూరులోని వైట్‌ఫీల్డ్‌లో నిర్మించిన ది ఎర్త్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆదివారం పాల్గొన్నారు. కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌తో కలిసి సీఎం చంద్రబాబు ది ఎర్త్ సెంటర్ భవనాన్ని ప్రారంభించారు. ప్రకృతి, సాంకేతికత, ఆధునిక పని వాతావరణాన్ని సమన్వయం చేస్తూ ది ఎర్త్ సెంటర్‌ను రూపొందించారు. సుస్థిర నిర్మాణం, ప్రకృతి అనుసంధానం, రీ-సైకిల్ చేసిన పదార్థాల వినియోగం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఈ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ కాంక్రీట్ జంగిల్స్ నుంచి పర్యావరణ హిత నిర్మాణాల వైపు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రే గ్రోత్ నుంచి గ్రీన్ గ్రోత్ వైపు అడుగులు వేయాలని సూచించారు. వనరులను అధికంగా



వినియోగించే భవనాలు కాకుండా వనరులను తెలివిగా వినియోగించేలా నిర్మాణాలు చేపట్టాలన్నారు. భవిష్యత్ తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, పర్యావరణాన్ని పరిరక్షిస్తూ అభివృద్ధి సాగాలని సీఎం స్పష్టం చేశారు. అభివృద్ధి ఆగకుండా పర్యావరణానికి గాయం చేయకుండా వినూత్న ఆలోచనలతో ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.

### ఇప్పటికే పర్యావరణ సమస్యలను ఎదుర్కొంటున్నాం

వాతావరణ మార్పులతో కలిగే

2లో..

## ఖైరతాబాద్ గణేష్ వద్ద పోటెత్తిన భక్తులు

**- కిటకిటలాడిన క్యూలైన్లు**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఖైరతాబాద్ బడా గణేశ్ దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో మహాగణపతిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. ఆదివారం ఒక్కరోజే లక్షమందికిపైగా భక్తులు దర్శించుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. బడా గణేశ్ దర్శనానికి 2 కిలోమీటర్ల మేర భక్తులు క్యూ కట్టారు. వృద్ధులు, చిన్నారులు మహాగణపతి దర్శనానికి రావద్దని ఉత్సవ నిర్వాహకులు విజ్ఞప్తి చేస్తున్నారు. దర్శనానికి నాలుగు గంటల సమయం పడుతోంది. భక్తులు అసౌకర్యానికి గురికాకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్తోపాటు పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రోజురోజుకూ భక్తుల సంఖ్య పెరుగుతోందని

2లో..

## నిత్యావసరాల ధరలను

# అదుపులో ఉంచాలి

**- ఎల్ నినో ప్రభావం, ప్రభుత్వ కార్యాచరణపై సీఎం చంద్రబాబు సమీక్ష**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం, తీసుకోవాల్సిన చర్యలు, కార్యాచరణ ప్రణాళిక అమలుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు, ఆర్‌ఎస్కే సిబ్బందితో ఆయన టెలీకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఎల్ నినో వంటి విపత్కర పరిస్థితుల్లో రైతులను ఆదుకోవడం, మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు పెరగకుండా నియంత్రించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని ఆయన స్పష్టం చేశారు. ఈ విపత్తును ఒక సవాలుగా స్వీకరించి, ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, "ఎల్ నినో పరిస్థితులను మనం ముందుగానే అంచనా వేశాం. దీనికోసం సిద్ధం చేసుకున్న యాక్షన్ ప్లాన్ ప్రకారం ప్రతి ఒక్కరూ పనిచేయాలి. ఎల్ నినో ప్రభావం కేవలం రైతులపైనే కాదు, అన్ని వ్యవస్థలపైనా పడుతుంది. కాబట్టి రైతులను కాపాడుకుంటూనే, వినియోగదారులపై ధరల భారం పడకుండా చూడటం మన బాధ్యత" అని అన్నారు.

బియ్యం, ఉల్లి, పామాయిల్, కందిపప్పు వంటి నిత్యావసరాల ధరలను కచ్చితంగా అదుపులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. గోదాముల్లోని బియ్యం నిల్వలను మార్కెట్‌లోకి విడుదల చేసి, ధరలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉల్లి కొరతను అధిగమించేందుకు ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేయడంతో పాటు, భవిష్యత్ డిమాండ్‌కు అనుగుణంగా ఉల్లి సాగును ప్రోత్సహించాలని తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను వివరిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా 50.7 శాతం లోటు వర్షపాతం నమోదైందని, ముఖ్యంగా ప్రకాశం, అన్నమయ్య, శ్రీ సత్యసాయి జిల్లాల్లో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో 30.84 లక్షల హెక్టార్లకు గాను, ఇప్పటివరకు 79 శాతం భూముల్లోనే సాగు పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు నష్టపోకుండా ఉండేందుకు పంటల బీమా మొత్తాలు వారికి అందేలా చూడాలని, డిమాండ్ ఆధారిత పంటల సాగుపై దృష్టి సారించాలని చెప్పారు. వర్షాధార పంటలు, ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను

2లో..

# ఎల్ నినో కంటే రేవంత్ రెడ్డే ప్రమాదకరం

**- 24 గంటల కరెంట్ పోయి 6-7 గంటలకే పరిమితమైందని విమర్శలు**
**- మూడు పంటల నుంచి రైతుబంధు పెండింగ్‌లో పెట్టారని ఆరోపణ**
**- పిట్ట బెదిరింపులకు భయపడేది లేదని ప్రభుత్వానికి హెచ్చరిక**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రకృతి విపత్తు అయిన ఎల్ నినో కంటే రేవంత్ రెడ్డే రాష్ట్రానికి అత్యంత ప్రమాదకరమని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే కరెంట్ కోతలు విధిస్తూ, నీళ్లు ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పెడుతోందని, రాష్ట్రంలో లేని కరవును సృష్టిస్తోందని ఆరోపించారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరులో పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హరీశ్ రావు మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న సర్వేలన్నీ కేసీఆర్‌కు అనుకూలంగా ఉన్నాయని, అందుకే కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికలు పెరిగాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని చెప్పుకుంటూనే రాక్షస పాలన సాగిస్తోందని విమర్శించారు.

2లో..



## దళితుల భూముల్లో

# అంగుళం కూడా తీసుకోం

**- దళితుల భూములపై మంత్రి పొంగులేటి భరోసా**

**- భూ రికార్డుల పరిశీలన హక్కుల పరిరక్షణకేనని, భూసేకరణ కాదని వివరణ**
**- కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపణ**
**- దళితులు, గిరిజనుల భూ హక్కులకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలోని దళితుల భూముల్లో అంగుళం కూడా ప్రభుత్వం తీసుకోదని, వారి భూములకు పూర్తి భద్రత కల్పిస్తామని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం స్పష్టం చేశారు. దళితులు, గిరిజనుల భూములను లాక్కోవడం ప్రజల ప్రభుత్వ విధానం కాదని ఆయన తేల్చిచెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం దళితుల భూములకు పూర్తి రక్షణ కవచంగా నిలుస్తుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు. దళితులు, గిరిజనులు, బడుగు బలహీన వర్గాల ఆశీస్సులతోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని పొంగులేటి పేర్కొన్నారు.

2లో..

# ఓఆర్ఆర్‌పై వేగం.. ప్రాణాలకు ముప్పు!

ఓఆర్ఆర్‌పై వాహనాల వేగ పరిమితి 120 కిలోమీటర్ల వరకు ఉండటంతో అతి వేగం కారణంగా ప్రమాదాలు తీవ్రతరం అవుతున్నాయి. ముఖ్యంగా రహదారి పక్కన వాహనాలను నిలిపే సమయంలో తగిన భద్రతా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

### అతివేగమే.. మరో ముప్పు

ఓఆర్ఆర్‌పై వేగంగా వెళ్తున్న లారీలు, ఇతర భారీ వాహనాలను అకస్మాత్తుగా నిలపడం వల్ల కూడా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మరోవైపు గచ్చిబౌలి నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి ఓఆర్ఆర్ మీదుగా ప్రయాణించే కొందరు కార్లు, ఇతర వాహనాలను అతివేగంగా నడపడం ప్రమాదాలకు దారితీస్తోంది. కొన్ని ప్రాంతాల్లో సర్వీస్ రోడ్డు నుంచి ఓఆర్ఆర్‌లోకి ప్రవేశించే సమయంలో వాహనదారులు సిగ్నల్ వ్యవస్థను వినియోగించకుండా వేగంగా దూసుకురావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఔటర్ పరిధిలో చెట్ల నరికివేత సమయంలో సంబంధిత హెచ్చరిక వ్యవస్థలను సైతం వినియోగించడం లేదని వాహనదారులు చెబుతున్నారు. హైవే సిబ్బంది రహదారి పక్కన వాహనాలను నిలిపి ఉంచడం కూడా ప్రమాదాలకు కారణమవుతోందని వారు పేర్కొంటున్నారు.

### ఎక్కువ ప్రమాదాలు అక్కడే

ఈ ఏడాది మార్చి నెలలో మేడ్చల్ జిల్లా శామీర్‌పేట ఓఆర్ఆర్ ఎగ్జిట్-7 సమీపంలో కొందరు రహదారి పక్కన తమ వాహనాలను నిలిపి భోజనం చేస్తున్నారు. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన కంటైనర్ లారీ వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ మార్గంలోని ట్రామా కేర్ సెంటర్ల పరిధిలో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని అక్కడి సిబ్బంది, స్థానికులు చెబుతున్నారు. ప్రమాదాలు సంభవించే ప్రాంతాల్లో మరింత భద్రతా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వారు పేర్కొంటున్నారు.

### ప్రమాదకర మలుపులు.. బోల్తా పడుతున్న భారీ వాహనాలు

శంషాబాద్ కాల్ సెంటర్‌కు సమాచారం అందిన పది నిమిషాల్లోనే ఘటనా స్థలానికి చేరుకుని సేవలందిస్తామని అక్కడి సిబ్బంది చెబుతున్నారు. ఒక్కో షిఫ్టులో ఇద్దరు ఎమర్జెన్సీ పారామెడికల్ సిబ్బంది, ఒక హెల్పర్, డ్రైవర్ విధులు నిర్వహిస్తున్నారు. ఓఆర్ఆర్‌పై ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాల్లో కొన్ని ప్రమాదకర మలుపులు ఉన్నాయి. దీంతో భారీ వాహనాలు, ట్రక్కులు బోల్తా పడుతున్న ఘటనలు నమోదవుతున్నాయి. మేడ్చల్ ఎగ్జిట్ గేట్ వద్ద పరిస్థితిని గమనించిన అధికారులు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడంతో అక్కడ ప్రమాదాలు కొంతమేర తగ్గుముఖం పట్టాయి.

### మిగతా ప్రాంతాల్లోనూ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

మేడ్చల్ ఎగ్జిట్ గేట్ వద్ద స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుతో ప్రమాదాలు తగ్గిన నేపథ్యంలో.. ప్రమాదకరంగా ఉన్న మిగతా ప్రాంతాల్లోనూ ఇలాంటి చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. రహదారి పక్కన వాహనాలు నిలిపే సమయంలో హెచ్చరికలు, భద్రతా పరికరాలు ఏర్పాటు చేయడంతో పాటు అతి వేగాన్ని నియంత్రించే చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## బీజేపీ అంతర్గత సర్వే జెన్ జీతో తెగిన బంధం

అవి తీవ్ర రూపం దాల్చి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు దారి తీయడం, దీంతో పాటే యువతలో బీజేపీపై పెరుగుతున్న అసహనం వంటి కారణాలతో కేబినెట్ మార్పులు ప్రధాని మోడీకి సవాల్ గా మారిపోయాయి. అయితే తాజాగా కేబినెట్ ప్రక్షాళనకు అడుగులు వేసే ముందు ఎంపీల పనితీరుపై బీజేపీ అంతర్గత సర్వే చేయించినట్లు తెలుస్తోంది. రహస్యంగా నిర్వహించిన ఈ సర్వేలో భారీ పరిపాలనాపరమైన జాప్యాలు, వివిధ నియోజకవర్గాల్లో బీజేపీ పట్ల పెరుగుతున్న ప్రజా వ్యతిరేకత బయటపడ్డాయని సమాచారం. కాక్రోచ్ ల నిరసనలు ఈ ఆందోళనకరమైన అంశాలను మరింతగా ధృవీకరించాయి. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య ఉన్న స్పష్టమైన అంతరాన్ని ఇవి బయటపెట్టాయి. వీటన్నింటి కంటే ముఖ్యంగా బీజేపీకి చెందిన ప్రస్తుత ఎంపీలలో అత్యధికులు తమ సొంత పనితీరు లేదా స్థానిక ప్రజాదరణ వల్ల కాకుండా, కేవలం ప్రధాని మోదీ వ్యక్తిగత ఆకర్షణ వల్లే తమ సీట్లను నిలబెట్టుకుంటున్నారని ఈ సర్వే తేల్చింది. మోడీ బ్రాండ్‌పై ఇలా అతిగా ఆధారపడటంలోని ప్రమాదాలను గ్రహించిన పార్టీ నాయకత్వం, గతంలో కేబినెట్ ప్రక్షాళన కోసం చేసిన ప్రణాళికలను ఆపేసినట్లు తెలుస్తోంది. మొత్తం పరిస్థితిని పునఃపరిశీలించడానికి ఒక కొత్త పరిశీలన బృందాన్ని కూడా నియమించింది. మరింత బలమైన, సమర్థవంతమైన మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసేందుకు, ఈ బృందం మొదటి నుండి ఈ కసరత్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఇది పూర్తయితే కానీ మోడీ కేబినెట్ విస్తరణ లేదా ప్రక్షాళన చేపట్టే అవకాశం లేదని సమాచారం.

## గ్రే గ్రోత్ నుంచి గ్రీన్ గ్రోత్ వైపు అడుగులు

దుష్పరిణామాలు భవిష్యత్తులో ఎదురయ్యే సమస్య కాదని ఇప్పటికే మన ముందున్న సవాలని సీఎం అన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని సూచించారు. భవన నిర్మాణాల్లో నెట్‌జీరో విధానాన్ని అవలంభించాలని, సోలార్ విద్యుత్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని, నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. చెత్తను కంపోస్టుగా మార్చడంతో పాటు రీ-యూజ్ విధానాన్ని విస్తృతంగా అమలు చేయాలని చెప్పారు. వీటితోనే స్వచ్ఛ భారత్, స్వచ్ఛ కర్ణాటక, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ లక్ష్యాలను సాధించగలమన్నారు.ప్రస్తుతం ఎదుర్కొంటున్న పర్యావరణ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ది ఎర్త్ సెంటర్ నిర్మాణం జరిగిందని చంద్రబాబు చెప్పారు. ఇలాంటి పర్యావరణ హిత భవనాలకే భవిష్యత్తు ఉంటుందని అన్నారు. ప్రజల అవసరాలను తీర్చే క్రమంలో ప్రకృతి పరిరక్షణకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఇప్పుడు నిర్మించే భవనాలే రాబోయే దశాబ్దాల్లో నగరాల వాతావరణాన్ని నిర్దేశిస్తాయనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. దశాబ్దాలుగా నగరాల అభివృద్ధి గ్రే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఆధారంగా సాగిందని సీఎం పేర్కొన్నారు. ఇకపై గ్రీన్ గ్రోత్, సర్క్యులర్ గ్రోత్, రీజెనరేటివ్ గ్రోత్ విధానాలు అవసరమన్నారు. స్వచ్ఛమైన విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకునేలా భవనాలను రూపొందించాలని సూచించారు. ప్రతి పైకప్పు ఒక పవర్ ప్లాంట్‌గా మారవచ్చు ప్రతి నీటి చుక్కను తిరిగి వినియోగించవచ్చు ప్రతి వ్యర్థ ప్రవాహాన్ని ఒక వనరుగా మార్చవచ్చు అని ముఖ్యమంత్రి అన్నారు. నీటిని, నేలను కాపాడటం అంటే సంపదను సృష్టించడమేనని చెప్పారు.

### వ్యవసాయంలోనే కాదు.. అభివృద్ధిలోనూ ప్రకృతికే ప్రాధాన్యత

వ్యవసాయంలో జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ విధానాన్ని ప్రోత్సహిస్తున్నామని, అదే స్ఫూర్తి పట్టణాభివృద్ధిలోనూ అవసరమని సీఎం అన్నారు. 2030 నాటికి 500 గిగావాట్ల నాన్-ఫాసిల్ విద్యుత్ సామర్థ్యాన్ని సాధించాలనే జాతీయ లక్ష్యంలో ఆంధ్రప్రదేశ్ కీలక భాగస్వామిగా ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో సుమారు 165 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని ప్రణాళిక చేస్తున్నామని చెప్పారు. అమరావతిని పర్యావరణ హిత నగరంగా తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పుడు సైబరాబాద్‌ను అభివృద్ధి చేశానని గుర్తుచేశారు. ఇప్పుడు మరో చక్కటి నగరాన్ని నిర్మించే అవకాశం తనకు దేవుడు ఇచ్చారని చెప్పారు. ప్రకృతి, సాంకేతికత, ఆధునిక మౌలిక వసతులతో అమరావతిని భవిష్యత్ తరాలకు అనువైన నగరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. భవిష్యత్ అవసరాలను గుర్తిస్తూ పర్యావరణాన్ని పరిరక్షిస్తూ ఈ ప్రాజెక్టును రూపొందించిన రఘువీర్ వీరమాచనేని, ప్రవీణ్ కుమార్, విస్టా స్పేసెస్ బృందం, వెంకటరమణన్ అసోసియేట్స్ ప్రతినిధుల్ని చంద్రబాబు అభినందించారు.

## క్యూర్ పరిధిలో 21 వేల ఇళ్లు పూర్తి

ఈ నెలాఖరులోగా ఎంపిక చేయాలని అధికారులకు కచ్చితమైన ఆదేశాలను ఇచ్చారు. సచివాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు, హౌసింగ్, వాటర్ వర్క్స్, విద్యుత్ శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. పూర్తయిన ఈ ఇళ్లకు సెప్టెంబరు 30 లోపు యుద్ధప్రాతిపదికన లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చెయ్యాలన్నారు.

ఈ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలని మంత్రి సూచించారు. ఈ ప్రక్రియలో లబ్దిదారుల ప్రస్తుత నివాసం కొత్తగా నిర్మాణం చేసిన ఇళ్లకు దగ్గరగా ఉన్నవారికే ప్రాధాన్యం ఇవ్వాలని కూడా చెప్పారు. ఇళ్లు ఉన్న ప్రాంతానికి ఐదు నుంచి ఏడు కిలోమీటర్ల లోపు నివసించేవారినే ఎంపిక చేయాలని సూచించారు. అక్కడ తాగునీరు, విద్యుత్, పారిశుధ్య సదుపాయాలు సరిగ్గా ఉండేలా చూడాలన్నారు. వాటర్ వర్క్స్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖలు కలిసి పని చేయాలని ఆదేశించారు. అక్టోబరు నెలాఖరులోగా ఈ మౌలిక సదుపాయాలు పూర్తి చేయాలని కూడా చెప్పారు. ఇప్పటికే రెండు పడకగదుల ఇళ్లలో ఉన్న అనర్హులను తొలగించాలని, అక్కడ నివసించని వారికి ఫైనల్ నోటీసు ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. స్పందించని వారి ఇళ్లను రద్దు చేసి, వారి స్థానంలో అర్హులకు కేటాయించాలన్నారు.క్యూర్ పరిధిలో ఇంటి స్థలాలు ఉండి అర్హులైన దాదాపు 9 వేల మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని కూడా తెలిపారు.

ఇన్‌ఛార్జి మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడి లబ్ధిదారులను ఎంపిక చేసి మంజూరు పత్రాలు అందించాలని సూచించారు. ఈ నిర్ణయాలు పేద ప్రజలకు స్వంత ఇల్లు కల్పించే దిశగా మరో అడుగు. ఇళ్లు పూర్తయిన తర్వాత సదుపాయాలు సకాలంలో అందేలా చూడడం ముఖ్యమని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.

## నేను బహుజనుల బాణాన్ని

'సీఎం.. సీఎం' అంటూ నినాదాలు వినిపించాయి. తాను అప్పటి ఎన్నికల ప్రచారంలో మూడో వ్యక్తినని చెబుతూ కోస్గి జూనియర్ కాలేజీ సెంటిమెంట్, కొడంగల్‌తో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజల ఆశీస్సులు తనపై ఉంటే.. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో తెలంగాణ రక్షణ సేన పార్టీదే అధికారమని కవిత ధీమా వ్యక్తం చేశారు. అయితే తాను ముఖ్యమంత్రి అవుతానని ఆమె నేరుగా ప్రకటించకుండా చంద్రబాబు, రేవంత్ రెడ్డి పేర్లను సభలో ప్రస్తావించి తన రాజకీయ ప్రస్థానాన్ని ఆ సెంటిమెంట్‌తో అనుసంధానం చేశారు. తనపై వివిధ రాజకీయ పార్టీలు చేస్తున్న వ్యాఖ్యలపై కవిత ఘాటుగా స్పందించారు. బీఆర్ఎస్ నేతలు తనను కాంగ్రెస్ విడిచిన బాణంగా అభివర్ణిస్తున్నారని అదే సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి తనను కేసీఆర్ వదిలిన బాణంగా చెబుతున్నారని ఆమె అన్నారు. మరికొందరు బీజేపీ బాణమంటున్నారని పేర్కొంటూ తాను ఎవరి బాణాన్ని కాదని తెలంగాణ బహుజనుల బాణాన్ని అని ప్రకటించారు. అధికారానికి, విద్యకు దూరంగా ఉన్న బహుజనుల కోసం తన పోరాటం కొనసాగుతుందని కల్వకుంట్ల కవిత చెప్పారు. యువత యుద్ధ నినాదం, మహాత్మా జ్యోతిబా ఫూలే ఆత్మగౌరవ భావన, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సిద్ధాంతాలు, సావిత్రిబాయి ఫూలే ఆశయాల కోసం తాను ముందుకు సాగుతున్నానని పేర్కొన్నారు. ఒక మహిళ ఎలాంటి రాజకీయ అండ లేకుండా కూడా రాజకీయంగా నిలబడగలదని నిరూపించాలన్నదే తన లక్ష్యమని చెప్పారు.ప్రజలు తనకు మద్దతు ఇస్తే ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో అయినా సీఎం రేవంత్‌రెడ్డితో అయినా కేసీఆర్‌తో అయినా పోరాడతానని కవిత తేల్చి చెప్పారు. తెలంగాణలో రాజకీయాలు కేవలం పరస్పరం విమర్శలు, దూషణలకే పరిమితం కావద్దని ఆమె వ్యాఖ్యానించారు. ప్రస్తుత అసెంబ్లీ రాజకీయాల తీరును ప్రస్తావిస్తూ ప్రజా గాయకుడు గద్దర్ పాటలోని పంక్తులను ఆలపించారు. 'భలే గుందిరో మన అసెంబ్లీ' అంటూ గద్దర్ పాటను గుర్తుచేసి ప్రస్తుత రాజకీయాలపై విమర్శలు చేశారు. ఈ సందర్భంగా సభలో కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. తెలంగాణ రైతుల సమస్యలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కవిత ఆరోపించారు. రైతులకు నీళ్లు, యూరియా, ధాన్యం కొనుగోళ్ల కోసం అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. వరి, మొక్కజొన్న రైతుల పంటలను కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఆమె ఆరోపించారు. పాలమూరు ప్రాంతానికి సాగునీరు అందించడంపైనా కవిత మాట్లాడారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే పాలమూరులో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తామని, ప్రజలకు ఉచిత వైద్యం అందించేందుకు భారీగా నిధులు ఖర్చు చేస్తామని ఆమె ప్రకటించారు.దేశంలో మహిళలను మహారాణులుగా కీర్తిస్తున్నప్పటికీ వంటింట్లోని గిన్నెలపైనా పురుషుల పేర్లే కనిపిస్తున్నాయని కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలోని రాష్ట్రాల్లో మహిళల రాజకీయ ప్రాతినిధ్యం గురించి ప్రస్తావిస్తూ మహిళలు మరింతగా రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. బహుజనులు, మహిళలు, యువత రాజకీయంగా ఎదగడానికి తన పోరాటం కొనసాగుతుందని కవిత స్పష్టం చేశారు. కోస్గి సభను తెలంగాణ రక్షణ సేన తన రాజకీయ విస్తరణలో కీలక కార్యక్రమంగా నిర్వహించింది. ఇప్పటికే నిజామాబాద్‌లో పాంచజన్య సంకల్ప సభ నిర్వహించిన ఆ పార్టీ తదుపరి ఇంద్రవెల్లిలో కూడా సభ నిర్వహించనున్నట్లు ప్రకటించింది.

## ఖైరతాబాద్ గణేష్ వద్ద పోటెత్తిన భక్తులు

మంత్రి తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా భక్తుల రద్దీకి తగ్గట్లు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించినట్లు పొన్నం వెల్లడించారు. భగవంతుడి కృపతో రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరినట్లు తెలిపారు. తెలంగాణలో వర్షాలు కురవాలని, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఇక్కడికి వచ్చే భక్తులు కోరుకోవాలని పొన్నం విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్లో ఖైరతాబాద్ గణేశుడు తర్వాత అంతటి ప్రసిద్ధి బాలాపూర్ గణపయ్యకే దక్కుతుంది. అత్యంత ప్రసిద్ధి చెందిన బాలాపూర్ గణేశ్ మండపానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. ఈ ఏడాది ఇక్కడ పూరీ జగన్నాథుడి ఆలయం నమూనాలో 18 అడుగుల వినాయకుడు భక్తులకు దర్శనమిస్తున్నాడు. 18 అడుగుల గణనాథుడి విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. గతంలో బాలాపూర్లో తిరుపతి, అరుణాచలం, అయోధ్య రామమందిరం తదితర ఆలయాల నమూనాల్లో గణేశుడు కొలువు దీరిన విషయం తెలిసిందే. రోజూ ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు భక్తుల దర్శనాలకు అనుమతినిస్తుండటంతో, స్వామివారిని దర్శించుకోవడానికి, ప్రత్యేక పూజల్లో పాల్గొనడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి క్యూలైన్లలో వేచి ఉంటున్నారు. ఈ రోజు ఆదివారం కావడంతో బాలాపూర్ స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. భక్తులు అసౌకర్యానికి గురికాకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

## నిత్యావసరాల ధరలను అదుపులో ఉంచాలి

వివరిస్తూ, హైరిస్క్ జోన్‌లోని ఉద్యాన పంటలను కాపాడేందుకు రూ.190 కోట్లు కేటాయించామని, ఆ నిధులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఖరీఫ్ కంటింజెన్సీ ప్రణాళిక కోసం రూ.60 కోట్లు సిద్ధం చేశామని, 1.31 లక్షల క్వింటాళ్ల విత్తనాలను 80 శాతం సబ్సిడీతో రైతులకు సరఫరా చేశామని తెలిపారు. స్వయం సహాయక బృందాల ద్వారా కిచెన్ గార్డెన్‌లను ప్రోత్సహించి కూరగాయల ధరలను అదుపులో ఉంచవచ్చని అభిప్రాయపడ్డారు. పశువులకు తాగునీరు, పశు గ్రాసం కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రస్తావిస్తూ, "2014-19 మధ్య మేము ఇరిగేషన్‌పై రూ.65 వేల కోట్లు ఖర్చు చేస్తే, 2019-24 మధ్య నాటి ప్రభుత్వం కేవలం రూ.22 వేల కోట్లే ఖర్చు చేసింది. ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే ఎల్ నినో వంటి విపత్తు వచ్చినా ఇబ్బందులు ఉండేవి కావు. మేము అధికారంలోకి వచ్చాక రూ.3,500 కోట్లతో 100 రోజుల్లో హంద్రీ-నీవా కాలువలకు నీరందించగలిగాం" అని చంద్రబాబు గుర్తుచేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, స్థానిక ఎన్నికలున్నా ప్రజాప్రతినిధులు గ్రామాల్లో పర్యటించి రైతులకు ధైర్యం చెప్పాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం, రైతు, సాగునీటి సంఘాలు కలిసికట్టుగా పనిచేసి ఎల్ నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కోవాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

## ఎల్ నినో కంటే రేవంత్ రెడ్డే ప్రమాదకరం

"అవకాశం ఉన్నప్పటికీ విద్యుదుత్పత్తి చేయకుండా బొగ్గు కొరత అనే సాకుతో కరెంట్ కోతలు విధిస్తున్నారు. కేసీఆర్ గారి హయాంలో 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తే ఇప్పుడు కేవలం 6-7 గంటల నాణ్యత లేని విద్యుత్ మాత్రమే వస్తోంది. దీంతో పంటలు ఎండిపోతున్నాయి. కృష్ణా నదిలో నీళ్లున్నా కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ వంటి లిఫ్టులను ఆన్ చేయడం లేదు," అని హరీశ్ రావు మండిపడ్డారు. మూడు పంటల నుంచి రైతుబంధు నిధులు విడుదల చేయలేదని, కరోనా కష్టకాలంలో కూడా కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు ఆపలేదని గుర్తుచేశారు. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిపై ప్రమాణం చేసి కూడా సీఎం రేవంత్ రెడ్డి దేవుణ్ని మోసం చేశారని ఆరోపించారు. బాండ్ పేపర్లపై ఇచ్చిన 420 హామీలు, గొర్రెల పంపిణీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాల ఊసే లేదని విమర్శించారు. తనను ప్రశ్నించినందుకు పిట్ట బెదిరింపులకు పాల్పడితే భయపడేది లేదని, ఆయన సంగతి చూస్తామని హెచ్చరించారు. "కేసీఆర్‌పై బురద చల్లితే రైతులకు న్యాయం జరగదు. పాలించడం చేతకాకపోతే నుదుటిపై 'నామమ్' రాసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలి" అని హరీశ్ రావు హితవు పలికారు.

## దళితుల భూముల్లో అంగుళం కూడా తీసుకోం

సామాజిక న్యాయం, పేదల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వాల ప్రధాన ప్రాధాన్యతలని అన్నారు. భూసంస్కరణలు, భూ పంపిణీ వంటి చారిత్రక నిర్ణయాలతో నిరుపేద దళితులకు భూములు ఇచ్చి హక్కులు కల్పించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని తెలిపారు. తెలంగాణ ప్రాంతంలో సుమారు 25 లక్షల ఎకరాల భూమిని దళితులకు, 2 లక్షల ఎకరాల పోడు భూములను గిరిజనులకు పంపిణీ చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని పేర్కొన్నారు. అధికారంలోకి వస్తే దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని చెప్పి మోసం చేసిన 'దొర' కేసీఆర్ మాటలను నమ్మవద్దని ఆయన ప్రజలను కోరారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌పై విచారణ జరుపుతామని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించిన నేపథ్యంలో ఈ వివాదం మొదలైంది. ఈ ఫామ్‌హౌస్ దాదాపు 700 ఎకరాల్లో విస్తరించి ఉందని, అందులో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని ముఖ్యమంత్రి ఆరోపించారు.

ఈ క్రమంలోనే ఎర్రవల్లి గ్రామానికి చెందిన 120 మంది దళిత రైతులకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. భూ యాజమాన్య హక్కులకు సంబంధించిన పత్రాలతో హాజరుకావాలని ఆ నోటీసుల్లో పేర్కొనడంతో దళితుల్లో ఆందోళన మొదలైంది. ఈ నేపథ్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. "ప్రభుత్వం మీ భూమిలో అంగుళం కూడా తీసుకోదు. మీ భూములను స్వాధీనం చేసుకునే ఉద్దేశం ఈ ప్రభుత్వానికి లేదు. మీ భూముల విషయంలో ఎలాంటి భయం, ఆందోళన అవసరం లేదు. ప్రజల ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది" అని దళితులకు భరోసా ఇచ్చారు.

భూ రికార్డుల పరిశీలన, సర్వే, భూ సమస్యల పరిష్కారం వంటి ప్రక్రియలను భూములు లాక్కోవడంగా చూడటం సరికాదని ఆయన హితవు పలికారు. ప్రజల భూ హక్కులను స్పష్టంగా నమోదు చేయడం, వివాదాలను పరిష్కరించడం, వారి హక్కులకు రక్షణ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు.కొంతమంది శక్తిమంతమైన వ్యక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం దళితులను రెచ్చగొట్టేందుకు ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తూ భయాందోళనలు సృష్టిస్తున్నారని మంత్రి ఆరోపించారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఇలాంటి ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి చర్య చట్టబద్ధంగా, పారదర్శకంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

## ములుగు జిల్లాలో తీవ్ర విషాదం.. నీటి కుంటలో పడి అక్కాచెల్లెళ్ల మృతి



ములుగు : సరదాగా తండ్రితో పాటు పొలానికి వెళ్లిన ఇద్దరు అక్కాచెల్లెళ్లు ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి ప్రాణాలు కోల్పోయారు. ములుగు మండలం కాసిందేపేట గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు మహమ్మద్ అంజద్ పాషా తన కుటుంబ సభ్యులతో కలిసి పత్తి చేనులో పురుగుల మందు కొట్టేందుకు తండ్రితో పాటు ఆయన ఇద్దరు కుమార్తెలు సమ్యాన్ (19), ఆసియా (10) కూడా పొలం వద్దకు వెళ్లారు.తండ్రి పొలంలో పనిచేసుకుంటుండగా, సాయంత్రం నాలుగు గంటల సమయంలో పిల్లలిద్దరూ సరదాగా సమీపంలో పంట సాగు నీటి నిల్వ కోసం తవ్విన గుంట (ఫాం పాండ్) వద్దకు వెళ్లారు. కొద్దిసేపటి తర్వాత పిల్లలు ఎక్కడా కనిపించకపోవడంతో కంగారుపడిన తల్లిదండ్రులు పొలం చుట్టుపక్కల వెతికారు.సందేహం వచ్చి నీటిగుంట వద్దకు వెళ్లి పరిశీలించగా, పిల్లలిద్దరూ నీటిలో మునిగిపోయి నట్లు గుర్తించారు. వెంటనే వారిని బయటకు తీసి కాపాడుకునేందుకు ప్రయత్నించి నప్పటికీ, లోతు ఎక్కువ కావడంతో అప్పటికే ఇద్దరు బాలికలు ప్రాణాలు కోల్పోయారు.

## ఎల్ నినో ఎంత అబద్ధమో, బొగ్గు కొరత కూడా అంతే అబద్ధం

**- మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి**



నల్లగొండ : ఎల్ నినో పేరు చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలు ఆడుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి ఆరోపించారు. ఎల్ నినో ఎంత అబద్ధమో, బొగ్గు కొరత కూడా అంతే అబద్ధమని వెల్లడించారు. నల్లగొండ జిల్లా కనగల్ మండలం తెలకంటి గూడెం గ్రామంలో ఎండిన పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ?రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానిది నేరపూరిత చర్య అని ఆరో పించారు. నీళ్లొచ్చినా కృష్ణా కింద పంటలు ఎందుకు ఎండబెడుతున్నారో సీఎం, మంత్రులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు కృష్ణా నీళ్ల వాడుకున్నామని అబద్ధం చెప్పిన మంత్రి ఉత్తమ్ కుమార్ రైతులకు ఏం సమాధానం చెపుతారని నిలదీశారు. గతంలోనూ కోమటిరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పంటలు సాగుచేసుకోలేకపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. కేసీఆర్ వచ్చినంకనే పంటలు సాగుచేసుకుని, బ్రహ్మాండంగా పంటలు పండించుకున్నారని, గడిచిన మూడేండ్లుగా పంటలు ఎండబెడుతున్నరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ హయాంలో వరుసగా నాణ్యమైన విద్యుత్తు 24 గంటలు అందించామని గుర్తు చేశారు. యాదాద్రి, భద్రాద్రిలో ఉత్పత్తి అయ్యే విద్యుత్ యూనిట్లు ఎందుకు నిలిపివేశారని ప్రశ్నించారు. నీళ్లు లేవని ఒకరు, బొగ్గు లేదని మరొకరు బంద్ పెడుతున్నారని విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యమంటే రైతులను ఇబ్బందులు పెట్టడమేనా అని ప్రశ్నించారు. ఓట్లేసి ఎన్నుకున్న ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.

## ట్రాన్స్‌జెండర్లకు, కాంగ్రెస్ వాళ్లు చేసే దానికి తేడా లేదు

**- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**




తెలంగాణ ప్రజలు కాంగ్రెస్, బీజేపీ లకు చెరో 8 ఎంపీ స్థానాలు ఇచ్చారు. కాంగ్రెస్ ఎంపీలు ప్రైవేటు వ్యక్తుల ఆస్తులపై దాడులు చేస్తున్నారు. ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ హరీష్ రావు ప్రైవేటు ప్రాపర్టీపై దాడి చేయడానికి వెళ్లారు. కాంగ్రెస్ వాళ్లు చెప్పి మరీ వెళ్తుంటే డీజీపీ ఏం చేస్తున్నారు. ఎంపీలు చేయాల్సిన పని ఇదేనా...? అని బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు.తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అరికెపూడి గాంధీ అనే ఎమ్మెల్యే పోలీసుల సహాయంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని చంపడానికి వెళ్లారు. పోలీసు బందోబస్తుతో హరీశ్ రావు పొలాలకు కాంగ్రెస్ వాళ్లను పంపించారు. సీఎం ప్రైవేటు ఆస్తుల వద్దకు వెళ్తే ఊరుకుంటారా..? ప్రజలు మిమ్మల్ని అధికార పీఠం మీద కూర్చోబెట్టింది ఇందుకేనా..? తెలంగాణలో భూ దందా నడుస్తోంది . తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి భూ దందాలకు పాల్పడుతున్నారన్నారు. నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి పార్లమెంట్ నియోజకవర్గం గద్వాలలో కులాంతర వివాహం చేసుకున్నందుకు దళిత కుటుంబంపై దాడి జరిగింది. ట్రాన్స్ జెండర్లకు, కాంగ్రెస్ వాళ్లు చేసే దానికి తేడా లేదు. ట్రాన్స్ జెండర్లు కనీసం పోలీసులు చెప్పింది పాటిస్తున్నారు. ఎంపీలకు కేంద్ర ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పిస్తోంది. ఒక్కో ఎంపీకి 8 లక్షల రూపాయలు కేంద్ర ప్రభుత్వం ఇస్తుంది. ప్రతి సంవత్సరం రూ.5 కోట్లు ఎంపీ ల్యాడ్స్ కింద నిధులు ఇస్తుంది. ఎంపీలు పార్లమెంట్ లో మాట్లాడాలి. తెలంగాణ ఉద్యమంలో మల్లు రవి,చామల కిరణ్ కుమార్ రెడ్డి ఎక్కడ వున్నారు. తెలంగాణలో శాంతి భద్రతలు దారుణంగా దెబ్బతిన్నాయన్నారు.

## వరుసగా రెండో ఏడాది గణపతి లడ్డూ కైవసం

**రూ.2,00,116కు లడ్డూను దక్కించుకున్న గిల్ల మహేష్**



కీసర( ప్రశ్న న్యూస్) కీసర సర్కిల్ దమ్మాయిగూడ డివిజన్ పరిధిలోని చీర్యాల్ ద్వారకామయి ఎన్‌క్లేవ్‌లో రెండవ వార్షిక గణపతి చతుర్థి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన సంప్రదాయ గణపతి లడ్డూ వేలం ఉత్సాహభరితంగా సాగింది.వేలంలో గిల్ల మహేష్ రూ.2,00,116కు గణపతి లడ్డూను కైవసం చేసుకున్నారు. ప్రత్యేకంగా, వరుసగా రెండో ఏడాది కూడా గిల్ల శ్రీకన్య–గిల్ల మహేష్ దంపతులే లడ్డూను దక్కించుకోవడం ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీంతో ఎన్‌క్లేవ్ వాసులు, భక్తులు, ఉత్సవ నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు ఎం.కె. ప్రసాద్, పి.బి.ఎస్.ఎస్. శ్రీనివాస్, గుగులోత్ లక్ష్మణ్ నాయక్ తదితరులు గిల్ల శ్రీకన్య–గిల్ల మహేష్ దంపతులను అభినందించారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరిస్తున్న ఎన్‌క్లేవ్ నివాసులు, భక్తులకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## భగవంతునికి చేరువయ్యేది భక్తి, ప్రేమ మార్గాలు

**– ధర్పల్లిలో సత్యసాయి జిల్లా ఆధ్యాత్మిక కోఆర్డినేటర్ ఈశ్వర్**



ధర్పల్లి(ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో భగవంతునికి చేరువయ్యేది భక్తి ప్రేమ మార్గాలేనని సత్య సాయి సేవా సమితి జిల్లా ఆధ్యాత్మి క కోఆర్డినేటర్ ఈశ్వర్ అన్నారు. ధర్పల్లి సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నవవిధ భక్తీ మార్గాలు అనే అంశంపై సత్సంగం నిర్వహించారు. నవవిధ మార్గా లైన శ్రవణం, కీర్తనశీ, స్మరణం, పాద సేవనం, అర్చనం, వందనం, దాస్యం సఖ్యశీ, ఆత్మ నివేదనం అనే మార్గాలు నవ విధాలుగా భగవంతునికి దగ్గర అయ్యేలా పనిచేస్తాయని ఆయన అన్నారు. శ్రవణం ద్వారా వాటిని ఆచరించడం, కీర్తనలు, స్మరణలు వలన మనిషిలో మంచి పరివర్తన చెంది మంచి ఫలితాలు పొందాటానికి చర్చించారు. ప్రతి కార్యంలో అహంకారం, మమకారం వాటికి దూరంగా ఉంటే భగవంతుని దయ, కృపలు పొందవచ్చని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవ సంస్థల జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, ఈశ్వర్, నాగభూషణం, బాలవికాస్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ మంజుల, ధర్పల్లి సత్యసాయి సేవా సమితి కన్వీనర్ మల్గరి శ్రీనివాస్, సమితి ప్రతినిధులు చిలుక శంకర్, మచ్చ బుచ్చన్న, బండి గంగాధర్, అంకశీ గంగస్వామి, బాలవికాస్ గురువు లు మంచి కంటి శోభ, మరిపెద్దిజ్యోతి, వినిత, మమత, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

## డెమొక్రటిక్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా సుల్తానా



గజ్వేల్ (ప్రశ్న న్యూస్ )డెమొక్రటిక్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సిద్దిపేట జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా సామాజిక ప్రజాసేవకురాలు, సోషల్ రీఫార్మేషన్ ఫౌండేషన్ అధ్యక్షురాలు డా. మహమ్మద్ సుల్తాన ఉమర్ నియమితులయ్యారు.ఆదివారం హనుమకొండ జిల్లా కేంద్రంలో డెమొక్రటిక్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీలను నియమించారు. అందులో భాగంగా సిద్దిపేట జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా డా. సుల్తాన ఉమర్‌ను నియమించినట్లు సంస్థ జాతీయ అధ్యక్షులు శ్రీనివాస్ రావు తెలిపారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న డా. సుల్తానకు ఈ బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. ప్రజల సమస్యలకు స్పందిస్తూ రాజ్యాంగబద్ధ, చట్టబద్ధ మార్గాల్లో సేవ చేయడమే డెమొక్రటిక్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలకు న్యాయం, హక్కులపై అవగాహన కల్పించడంతో పాటు మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.సమావేశంలో సంస్థాగత బలోపేతం, ప్రజాసేవకు సంబంధించిన పలు తీర్మానాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.అనంతరం డా. సుల్తాన ఉమర్ మాట్లాడుతూ.. డెమొక్రటిక్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సిద్దిపేట జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా తనను నియమించినందుకు కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల హక్కులు, సామాజిక న్యాయం, ప్రజాసేవ కోసం మరింత విస్తృతంగా కార్యక్రమాలు చేపడతామని, సంస్థ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.ఇటీవల డా. సుల్తాన ఉమర్‌కు గౌరవ డాక్టరేట్ లభించిన సందర్భంగా సమావేశంలో ఆమెను ప్రత్యేకంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు నక్క గంగారాం, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు దేవుల శ్రీనివాస్, వరంగల్ జిల్లా బాధ్యులు మహిపాల్, వివిధ జిల్లాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చినుకులు పడితే చాలు..

# రాంపల్లి చౌరస్తా మురుగుమయం

**- చిన్న వర్షానికే మురికి నీటితో రాంపల్లి చౌరస్తా - రోడ్లపైకి మురుగు.. ప్రజలు, వాహనదారులకు అవస్థలు**

**- నాగారం అభివృద్ధిలో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం ఏదీ.?**







ఘట్కేసర్ ( ప్రశ్న న్యూస్) ఘట్కేసర్ సర్కిల్, నాగారం డివిజన్: గత పదేళ్లుగా నాగారం అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నా.. రాంపల్లి చౌరస్తాలో మాత్రం డ్రైనేజీ సమస్యకు పరిష్కారం కరువైంది. చిన్నపాటి వర్షానికే రోడ్లపైకి మురుగునీరు చేరడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.మురుగునీరు రోడ్లపై ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అభివృద్ధి అంటే కేవలం భవనాలు, రోడ్ల నిర్మాణాలే కాదు.. ప్రజలకు ఇబ్బందులు లేకుండా మెరుగైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయడం కూడా అభివృద్ధిలో భాగమేనని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.చిన్న వర్షానికే ఈ పరిస్థితి ఉంటే.. భారీ వర్షాలు కురిస్తే రాకపోకలు బంద్ అయిన సంఘటనలు కూడా లేకపోలేదు. ఇది ఇలానే ఉంటే పరిస్థితి ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రాంపల్లి చౌరస్తా డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని నాగారం ప్రజలు కోరుతున్నారు.

# బోయిన్ పల్లి మార్కెట్ లో

# ధర్న సైరెన్ మోగిందా.?

**- కమీషన్ల కోసమేనా కమర్షియల్ కాంప్లెక్స్: ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహా**

**- పరిషాన్లు పక్కకు పెట్టి, కమర్షియల్ కి ఓకేనా ఇదేమి విడ్డూరం: హామాలీస్.**

**- కోటి అరవైతో కమర్షియల్ కాంప్లెక్స్ వద్దు,మార్కెట్ అభివృద్ధి మాకు ముద్దు:హామాలీస్.**

**- తల తోక లేని దానికి శంకుస్థాపనలు.అసలు వదిలి,అనవసమైన వాటికి పూజలు:నర్సింహా.**

**- మార్కెట్ లో మంచినీళ్ళు లేవ్,చెత్త చెదారంతో దుర్వాసన,ఈగలు,దొమలు,గుంతలతో రహదారులు,**

**ప్రాధమిక చికిత్స కేంద్రానికి తాళం,వారానికొకసారి పెద్ద ఆసుపత్రికి క్యూ, వాంతులు,జ్వరంతో అవస్థలు హమాలీ యూనియన్ పెద్దలు ఆరోపణలు.**

**- ఎమ్మెల్యే,ఎంపీ కి సామాన్యుల బాధలు పట్టవా,పిట్ట కథలు చెప్పి చూట్టంగా వచ్చి పోతున్నారు.**

**- వార్షిక ఆదాయం"14"కోట్లు, అభివృద్ధి మాత్రం ఆమడదూరంలో ఉంది.**

**- కమిటీ పై కోపం,కమీషన్ ఏజెంట్ల పాలిట శాపం, కనికరించని సర్కార్, కడుపులో పెట్టుకొని ఖజానా నింపుతున్నాం సామ.**

**- యార్డులో అధికారులు, సిబ్బందికి అనుభవం లేక అన్నిటికీ అవాంతరాలు.**

**- పెద్ద దిక్కు లేని బోయిన్ పల్లి మార్కెట్ కి ? తూతూ మంత్రంగా వ్యవహరిస్తున్న మార్కెటింగ్ డిపార్ట్మెంట్.**

కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో మౌళిక సదుపాయాల కల్పనలో సర్కార్ ఫెయిల్యూర్ అయ్యిందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ వెజిటబుల్ మార్కెట్ హమాలీ యూనియన్ అధ్యక్షుడు నర్సింహా ఆవేదన వ్యక్తంచేశారు.2001 డిసెంబర్ 20 న మోండ మార్కెట్ నుంచి విడిపోయిన తర్వాత తిరుమల గిరి మండలం పరిధిలో సర్వే నెంబర్:81, 82 పీ లో 21 ఎకరాల 23గుంటల భూమిలో నూతనంగా బోయిన్ పల్లి మార్కెట్ ని అప్పటి సర్కార్ నిర్మించింది.కాలక్రమేనా కమీషన్ ఏజెంట్లు కొందరు కొందురు గా "175"మంది షాపు యజమానులు వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నారు.దీనికి తోడుగా "గ్రేన్ మర్చెంట్స్ కి కూడా దుకాణాలు కేటాయించడంతో వారు భారీగానే బిజినెస్ మొదలు పెట్టారు.ఇలా సాఫీగా జరుగుతున్న నేపథ్యంలో 2013 లో కొత్త లైసెన్స్ లు పేరుతో మరో"44"లైసెన్స్ లు జారీ చేశారు మార్కెటింగ్ డిపార్ట్మెంట్.బోయిన్ పల్లి మార్కెట్ పరిధిలో సుమారు నాలుగు మండలాలు ఉండేవి, ప్రస్తుతం మూడు మండలాల్లో విస్తరించింది డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్.ఈమార్కెట్ లో పోటి ఎక్కువై దినదినాభివృద్ధి చెందుతూ వార్షిక ఆదాయం సుమారు 14 కోట్లు వసూలు అవుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.ఇంత పెద్ద మార్కెట్ లో అన్ని సమస్యలే,మౌళిక సదుపాయాల కల్పనలో మార్కెటింగ్ డిపార్ట్మెంట్ నిర్లక్ష్యం వల్ల రైతులు, కమీషన్ ఏజెంట్లు,ఖరీదు దారులు,హమాలీలు సైతం ప్రతి రోజూ నరకం అనుభవిస్తున్నారు.మరిముఖ్యంగా రాత్రి,పగుళ్లు విధులు నిర్వహిస్తున్న హామాలీల బాధలు వర్ణనాతీతం.బోయిన్ పల్లి మార్కెట్ లో సుమారు:1500 మంది హమాలీలు వివిధ రకాల సేవలు అందిస్తున్నారు.వారిలో కొందరు వారానికి ఒకసారి వివిధ రుగ్మతలతో హాస్పిటల్ పాలౌతున్నారు.వారి కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు.ఈ నేపథ్యంలో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ వెజిటబుల్ మార్కెట్ హామాలీ యూనియన్ నాయకులు ఈ నెల 21/9/26 ఉదయం మార్కెట్ ప్రధానకార్యాలయం ముందు ధర్నాకు దిగుతున్నట్లు వారు కమిటీ,అధికారులకు, కమీషన్ ఏజెంట్లకు లేఖలు అందజేశారు.

**తల తోక లేని శంకుస్థాపనలు,ఏది ముందో**

**ఏది తర్వాతో తెలియని నాయకులు ?**

ఈ మధ్యనే డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో మార్కెటింగ్ డిపార్ట్మెంట్ కోటి అరవై లక్షల రూపాయలతో నూతన వ్యాపార సముదాయాల భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన విషయం విదితమే.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్.పార్టలు వేరైనా మార్కెట్ కారిక్రమాలకు హాజరైనారు.నేతలు గతం గురించి చేబుతారు.మార్కెట్ అభివృద్ధికి తొడుపడరని అందరు గుసగుసలాడుకుంటున్నారు.ఇక హామాలీలైతే మరో అడుగు ముందుకేసి బోయిన్ పల్లి మార్కెట్ లో గత కొంత కాలంగా మౌళిక సమస్యలు తాండవం ఆడుతున్నాయని వాటిని పట్టించుకోండి మహా ప్రభూ అంటూ ప్రతి ఒక్కరికీ ప్రత్యేకంగా దండాలు పెడుతున్నప్పటికి తల ఊపి జారుకుంటున్న నేతలు, అధికారులు అని గుర్రు మంటున్న హామాలీలు.బోయిన్ పల్లి మార్కెట్ లో సుమారు"1500"మంది హామాలీలు ప్రతి రోజూ నరకం అనుభవిస్తూ పనులు చేస్తున్నట్లు వారు ఆవేదన చెందుతున్నారు.

**అందుకనే ఈ రోజు నుంచి**

**మా ప్రాధమిక హక్కు కోసం**

పోరాటం చేస్తున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ వెజిటబుల్ మార్కెట్ హమాలీ యూనియన్ అధ్యక్షుడు నర్సింహా పేర్కొన్నారు.
న్యాయం జరిగే దాక ధర్న కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

**ఎమ్మెల్యే శ్రీ గణేష్,ఎంపీ ఈటల,మార్కెటింగ్ అధికారులకు మా మాటలు పట్టవా:నర్సింహా.**

డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో గత రెండేళు ్లగా గుత్తేదారులకు బిల్లులు మంజూరు కాక గాలికి వదిలేశారు.ముఖ్యంగా "సెక్యూరిటీ "కాంట్రాక్టర్ "12"మందితో గ్రౌండ్లో పనులు చేయించాలే,కానీ మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అలసత్వం కారణంగా ఏడు మందితో ఇంత పెద్ద మార్కెట్ లో సెక్యూరిటీ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.ప్రతి రోజు ట్రాఫిక్ జాం వల్ల ఖరీదు దారులు హమాలీలు, కమీషన్ ఏజెంట్లు తలలు పట్టుకుంటున్నారు.మరో విషయం ఏమిటంటే "డబుల్ మార్కెట్"ఉన్నప్పుడు మార్కెట్ సెక్రటరీ తో పాటు సిబ్బంది కూడా గ్రౌండ్లో చెమట ఓడ్చిన ఫలితం శూన్యం.ఇక
మౌళిక సదుపాయాల కల్పనలో మార్కెటింగ్ డిపార్ట్మెంట్ నిర్లక్ష్యం వల్ల మార్కెట్ వచ్చే మహిళలు సైతం మరుగు దొడ్లు లేవని దుమ్మెత్తి పోస్తున్నారు.స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్ ఎన్నికై రెండేళ్లు గడుస్తున్న బోయిన్ పల్లి మార్కెట్ నీ ఎం అభివృద్ధి చేశారని నర్సింహా ప్రశ్నించారు.చివరకి బోయిన్ పల్లి మార్కెట్ కి మంచి నీటి సరఫరా కోసం"55"లక్షల రూపాయలు సర్కార్ చెక్ ఇస్తే,కంటోన్మెంట్ అధికారులు టెండర్ ప్రక్రియ పూర్తి చేసుకున్న తర్వాత తీర చూస్తే "చెక్కు"చుక్కలు చూపించింది.ఈ మధ్య మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మార్కెట్ లో ధర్న చేశారు






సంతోషం,కానీ ఆయన ఎంపీ నిధుల నుంచి కనీసం మౌళిక సమస్యల పరిష్కారం కోసం ఒక్క పైసా కూడా (నిధులు మంజూరు చేసిన) ఇచ్చిన దాఖలాలు లేవు.ఇదిఇద్దరి పెద్దమనిషుల మేధస్సు,ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకోవడం తప్ప మార్కెట్ కి పనికి వచ్చేది ఏమీ లేదు.

**వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ కి హెచ్చరిక: నర్సింహా.**

వీలైనంత త్వరగా డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి, బోయిన్ పల్లి మార్కెట్ లో సుమారు పదిహేను వందల మంది హామాలీలు రేయి పగలు తేడా లేకుండా పనులు చేస్తున్నట్లు,మీ నిర్లక్ష్యం వల్ల కొంత మందికి ఆరోగ్య పరిస్థితి బాగోలేదని, వాంతులు, విరోచనాలు, జ్వరాలు వివిధ రకాల రుగ్మతలతో బాధపడుతున్నారు. ఇక మార్కెట్ అధికారులు చర్యలు చేపట్టని పక్షంలో భవిష్యత్తులో పోరాటం మరింత ఉద్రిక్తంగా చేస్తామని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి, డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ వెజిటబుల్ మార్కెట్ హమాలీ యూనియన్ అధ్యక్షుడు నర్సింహా తెలిపారు.

## వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా గణనాథుని పూజలు

బడంగ్ పేట్ (ప్రశ్న న్యూస్) శ్రీ సాయి బాలాజీ హోమ్స్ పేస్ 2 రోడ్ నంబర్ 1లో ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపంలో స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన గణనాథుడు నిత్యపూజలతో భక్తులను అనుగ్రహిస్తున్నాడు. ప్రతి సంవత్సరం వినాయక చవితి సందర్భంగా విభిన్న రూపాల్లో ఉన్న భారీ వినాయక విగ్రహాన్ని ప్రతిష్టించి సామూహిక నిమజ్జనం వరకు 11 రోజుల పాటు అంగరంగ వైభవంగా అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నామని మండప నిర్వాహకులు సాయికుమార్, గంటాల. పవన్ తెలిపారు. మండపంలో ప్రతి రోజు సాయంత్రం పూజలు, కుంకుమార్చన, తీర్థప్రసాదాలు వితరణతో పాటు సంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండప నిర్వహణలో శ్రవణ్, ప్రవీన్, ప్రశాంత్, రాం, మనోహర్, రాజారామేశ్వర్, ఉదయ్, మెహర్ నాథ్, లక్ష్మి నారాయణ, రాజా, నారాయణ రమేష్, సంతు తదితరులు చోరవతో ఆహ్లాదకర వాతావరణంలో గణేష్ నవరాత్రుల వేడుకలు దిగ్విజయంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.





## భారత్ నగర్‌లో వైభవంగా గణపతి అభిషేకం

**- ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు భారత్ నగర్‌లో సిరి అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి 108 లీటర్ల స్వచ్ఛమైన ఆవుపాలతో విశేష అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అలంకరణలు భక్తిశ్రద్ధలతో చేపట్టి, అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిరి యూత్ అసోసియేషన్ సభ్యులు ప్రతి ఏటా గణపతి నవరాత్రి ఉత్సవాలను ఎంతో నిష్టతో, కన్నులపండువగా నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. భక్తిభావంతో పాటు సామాజిక దృక్పథంతో ఉత్సవాలు జరపడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గుంటుకు శిరీష రాజు ముదిరాజ్, అయ్యప్ప ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు జగ్గయ్యగారి శేఖర్, బుక్క రమేష్, జిల్లా కళ్యాణ్ మాధవి దంపతులు, సహస్ర, నిఖిల, సిరి యూత్ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వ్యతిరేక విధానాలపై విద్యార్థులు ఐక్యంగా ఉద్యమించాలి

**- ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు నిరంతర పోరాటాలు చేపట్టాలి**
**- యూఎస్ఎఫ్ఐ జాతీయ సలహాదారు అరుణ్ కుమార్**




గజ్వేల్ ( ప్రశ్న న్యూస్) యునైటెడ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (యూఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలు సంగారెడ్డి జిల్లాలో మూడు రోజులపాటు ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించి ముగిశాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి విద్యార్థి ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఈ సమావేశాలకు హాజరయ్యారు. ప్లీనరీలో రాష్ట్ర విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలు, విద్యార్థుల సమస్యలు, ప్రభుత్వ విద్యాసంస్థల పరిస్థితి, విద్యార్థులకు అందాల్సిన సౌకర్యాలు, ఫీజులు, ఉపకార వేతనాలు, ఉపాధి అవకాశాలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా యూఎస్ఎఫ్ఐ జాతీయ సలహాదారు అరుణ్ కుమార్ మాట్లాడుతూ విద్య ప్రతి విద్యార్థి ప్రాథమిక హక్కు అని అన్నారు. విద్య కొద్దిమందికే అందుబాటులో ఉండే వస్తువుగా మారకుండా పేద, మధ్యతరగతి విద్యార్థులందరికీ నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయడంతో పాటు విద్యారంగంలో ప్రభుత్వ పెట్టుబడులు, మౌలిక వసతులు, విద్యార్థుల సంక్షేమంపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యారంగంలో ప్రైవేటీకరణ, వాణిజ్యీకరణకు దారితీసే విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థులు, అధ్యాపకులు, మేధావులు, ప్రజాసంఘాలు కలిసి పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను భర్తీ చేయడంతో పాటు పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు అందాల్సిన ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి గృహ సౌకర్యాలు, పాఠ్యపుస్తకాలు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం తదితర సంక్షేమ పథకాలను సకాలంలో అందించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాలు, పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువును మధ్యలోనే నిలిపివేయాల్సిన పరిస్థితి రాకుండా ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు.

విద్య పూర్తిచేసుకున్న యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వాలు స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఉద్యోగ నియామకాలు, పోటీ పరీక్షలు, నిరుద్యోగ సమస్యలపై కూడా యూఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. విద్యార్థుల సమస్యలను వ్యక్తిగత సమస్యలుగా కాకుండా సామాజిక సమస్యలుగా గుర్తించి, విద్యార్థుల హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. విద్యారంగానికి సంబంధించిన విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విద్యార్థులను చైతన్యవంతం చేయడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా ఉద్యమాలు నిర్వహించాలని సూచించారు. ఈ రాష్ట్ర ప్లీనరీ సమావేశాల్లో యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు తాటికొండ రవి, మదం తిరుపతి, రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్లు, రేణుక, సూరి, నాగరాజు, రాజేష్, రాథోడ్, సయ్యద్, శేఖర్, రవి, జిల్లా అధ్యక్షుడు సందీప్, జిల్లా నాయకులు అనిల్, తులసి, రుక్మిణి, ప్రియాంక, సాహితి, ధరణి,టి. సందీప్ జిల్లా అధ్యక్షుడు వివిధ జిల్లాల ప్రతినిధులు, విద్యార్థి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని భవిష్యత్ ఉద్యమాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

## వినాయక మండపంలో గణపతి హోమం - అన్న ప్రసాద వితరణ





సుల్తాన్ బజార్ (ప్రశ్న న్యూస్) వినాయక నవరాత్రుల్లో భాగంగా కృపారాంబాగ్లో వీనస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన గణనాథుని మండపంలో ఆదివారం నాడు నిఖిల్ పూజారి నేతృత్వంలో గణపతి హోమం, అన్న ప్రసాద వితరణ కార్యక్రమలను నిర్వహించినట్లు శాంత్ కుమార్ తెలిపారు. ప్రతి సంవత్సరం వినాయక చవితి సందర్భంగా విభిన్న రూపాల్లో ఉన్న వినాయకుడిని ప్రతిష్టించి వినాయక చవితి నుండి సామూహికంగా నిమజ్జన కార్యక్రమం వరకు 11 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఘనంగా పూజలను నిర్వహిస్తున్నామని తెలిపారు. వీనస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ సంవత్సరం (2026) స్వర్ణోత్సవ ఉత్సవాలు జరుపుకుంటున్న సందర్భంలో గణపతి హోమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రతి రోజు మండపం వద్ద నిర్వహించే సాయంకాల ప్రత్యేక పూజ కార్యక్రమాలు, ప్రసాద వితరణ, మహహారతి కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారని తెలిపారు. ఈ రోజు (ఆదివారం) నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో ముఖ్య అతిథులుగా అర్.కే. సుబాష్, మనోజ్, ప్రభాకర్, రఘు, సుచేంద్ర, శర్మాజీ, ఓపి సోని, కిషన్ రావు, నితిన్ కపూర్, శుభం కపోకపూర్, దాస్ పాల్గొన్నగా మండప నిర్వాహణలో వినాయక్, అగ్నివేష్, చిద్విలాస్, శివ, అభి, అరుణ్, ప్రతీక్, అనిల్ తదితరుల ప్రత్యేక చొరవతో ఆహ్లాదకర వాతావరణం గణేష్ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు శాంత్ కుమార్ తెలిపారు.

# నైపుణ్యం నేర్పి.. ఉపాధి కల్పించి

**- 150 మందికి బ్యూటీషియన్ సర్టిఫికెట్లు.. 200 మందికి కుట్టు మిషన్లు**
**- మహిళల జీవితాల్లో మార్పు కోసం ఏఎండిఆర్ ఫౌండేషన్ బృహత్తర కార్యక్రమం**







కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) మహిళలకు నైపుణ్య శిక్షణ అందించి, వారిని స్వయం ఉపాధి దిశగా నడిపించాలనే లక్ష్యంతో ఏఎండిఆర్ ఫౌండేషన్ ఫర్ సోషల్ చేంజ్ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు పేర్కొన్నారు. మహిళా సాధికారత, స్కిల్ డెవలప్‌మెంట్, స్వయం ఉపాధిని ప్రోత్సహించే దిశగా ఫౌండేషన్ మరో ముందడుగు వేసింది. కొత్తగూడెం క్లబ్ వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో మూడు నెలల ఉచిత బ్యూటీషియన్ కోర్సు విజయవంతంగా పూర్తి చేసిన 150 మంది శిక్షణార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. అదే విధంగా టైలరింగ్‌లో శిక్షణ పొందిన 200 మంది మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. శిక్షణతో పాటు ఉపాధి సాధనకు అవసరమైన పరికరాలను అందించడం ద్వారా మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేందుకు ఫౌండేషన్ చేయూతనందించడం కార్యక్రమానికి ప్రత్యేకతగా నిలిచింది.

### శిక్షణతో పాటు ఉపాధికి చేయూత

కేవలం శిక్షణ ఇచ్చి వదిలేయకుండా, నైపుణ్యాన్ని ఆదాయ మార్గంగా మార్చుకునేందుకు అవసరమైన సహకారం అందించడం ద్వారా ఏఎండిఆర్ ఫౌండేషన్ సామాజిక బాధ్యతను చాటుకుంటోందని అతిథులు పేర్కొన్నారు. బ్యూటీషియన్ కోర్సు పూర్తి చేసిన మహిళలు ఇంటి వద్దే సేవలు అందించడంతో పాటు బ్యూటీ పార్లర్లలో ఉపాధి పొందేందుకు అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు. టైలరింగ్ శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్లు అందించడం వల్ల స్వయం ఉపాధికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని అన్నారు.

### ఆదిల్‌పై ప్రశంసల వర్షం

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, ప్రముఖులు ఏఎండిఆర్ ఫౌండేషన్ ఫౌండర్ ఆదిల్‌ను ప్రత్యేకంగా అభినందించారు. మహిళలకు ఉచితంగా శిక్షణ అందించడంతో పాటు వారికి స్వయం ఉపాధి సాధనాలను అందించడం అభినందనీయమన్నారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఇటువంటి కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. మహిళలకు నైపుణ్యం అందించడం అంటే ఒక కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే కాకుండా, సమాజంలో వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచడమని వారు పేర్కొన్నారు. ఏఎండిఆర్ ఫౌండేషన్ భవిష్యత్తులో మరిన్ని నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి యువత, మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేయర్ మూడ్ గణేష్ చౌహన్, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత, కార్పొరేటర్లు సుగుణ, భవిత, డాక్టర్ స్వప్న, డాక్టర్ బిఎస్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ లాల్ సింగ్ నాయక్, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నాగ సీతారాములు, టీపీసీసీ సభ్యులు జెబి శౌరి, సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కోనేరు సత్యనారాయణ (చిన్ని), ఖమ్మం కాంగ్రెస్ యువ నాయకురాలు షహెల జావిద్, సర్పంచ్ అజ్మీరా లైలా, కొత్తగూడెం క్లబ్ సెక్రటరీ కోనేరు పూర్ణచందర్ రావు, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఫహీమ్ దాదా, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండి గౌస్ మొయినుద్దీన్, ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ అల్లాడి నర్సింహారావు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఫౌండేషన్ ప్రతినిధులు, శిక్షణార్థులు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పరిమితులు చెరిపి.. శిఖరాలకు చేరాలి

**ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలి: ఎమ్మెల్యే గళ్లా మాధవి**
**ప్రతిభావంతులకు స్కాలర్‌షిప్‌లు, దుప్పట్లు, బ్యాగుల పంపిణీ**



గుంటూరు(ప్రశ్న న్యూస్) ఆడపిల్లలు తమకు ఎదురయ్యే పరిమితులను అధిగమించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. విద్య, ఉద్యోగం మాత్రమే కాకుండా రాజకీయాలు, పరిపాలన, సామాజిక రంగాల్లోనూ నాయకత్వం వహించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. చదువే జీవితాన్ని మార్చే శక్తివంతమైన సాధనం అని పేర్కొన్నారు. గుంటూరు అరండల్‌పేట 11/2 లైన్‌లోని రజక భవన్‌లో ఆదివారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, దుప్పట్లు, బ్యాగుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గళ్ళా మాధవి విద్యార్థినులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు.

### మారుతున్న పరిస్థితులు.. పెరుగుతున్న అవకాశాలు

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకప్పుడు విద్య, ఉద్యోగాల్లో ఆడపిల్లలకు అవకాశాలు పరిమితంగా ఉండేవని, ప్రస్తుతం పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో తమ ప్రతిభను నిరూపించుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో బాలికలు పాల్గొనడం సమాజంలో వచ్చిన సానుకూల మార్పుకు నిదర్శనమన్నారు. చదువు కోసం కుటుంబాలకు దూరంగా వసతి గృహాల్లో ఉంటూ విద్యను అభ్యసించడం సులభమైన విషయం కాదన్నారు. అయితే హాస్టల్ జీవితం విద్యార్థులకు భిన్న ప్రాంతాలు, సంస్కృతులు, ఆలోచనా విధానాలకు పరిచయం చేస్తుందని చెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులతో కలిసి మెలిసి ఉండటం ద్వారా విశాల దృక్పథం పెంపొందుతుందని తెలిపారు.

### లక్ష్యం పెట్టుకుని.. పట్టుదలతో సాగాలి

ప్రతి విద్యార్థి జీవితంలో ఒక ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. లక్ష్యాన్ని చేరుకునే వరకు పట్టుదలతో శ్రమించాలని చెప్పారు. కేవలం మంచి మార్కులు సాధించడమే కాకుండా సమాజంలో నాయకత్వ పాత్ర పోషించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ముఖ్యంగా బాలికలు రాజకీయ రంగంలోకి కూడా రావాలని, ప్రజా సమస్యలపై అవగాహన పెంచుకుని సమాజ భవిష్యత్తును తీర్చిదిద్దే నిర్ణయాలు తీసుకునే స్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారు.

### నన్ను నిలబెట్టింది.. చదువే

తనను ప్రస్తుత స్థాయికి తీసుకొచ్చింది కూడా విద్యేనని గళ్ళా మాధవి తెలిపారు. కార్యక్రమంలో రజక సంఘ నాయకులు, వసతి గృహ నిర్వాహకులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానంలో భక్తులతో మమేకమైన మంత్రి అచ్చెన్న

**స్వగ్రామం నిమ్మాడలో గణేష్ ఉత్సవాల్లో పాల్గొన్న వ్యవసాయశాఖ మంత్రి**



కోటబొమ్మాళి(ప్రశ్న న్యూస్) ప్రజా కార్యక్రమాలతో నిత్యం బిజీగా ఉండే రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్వగ్రామం నిమ్మాడలో గణేష్ ఉత్సవాల సందర్భంగా సందడి చేశారు. గ్రామానికి వచ్చిన ఆయన ప్రజలను ఆప్యాయంగా పలకరించి.. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులతో మమేకమయ్యారు.మంత్రి అచ్చెన్నాయుడు, శ్రీమతి విజయ మాధవితో కలిసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు స్వయంగా అన్నం వడ్డించారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా భక్తులతో ఆప్యాయంగా మాట్లాడారు. అనంతరం భక్తులతో కలిసి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

### ఉత్సవాల ఏర్పాట్లపై ఆరా

ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, నాయకులు, యువత, భక్తులు మంత్రిని కలిశారు. ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్ల వివరాలను ఆయనకు తెలియజేశారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని మంత్రి సూచించారు. ఉత్సవాల సందర్భంగా గ్రామంలో సోదరభావం, ఐక్యత వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

### గ్రామస్థులతో ఆత్మీయ పలకరింపు

స్వగ్రామానికి వచ్చిన మంత్రి అచ్చెన్నాయుడిని పలువురు గ్రామస్థులు ఆప్యాయంగా కలుసుకున్నారు. వారి సమస్యలు, గ్రామ పరిస్థితులపై ముచ్చటించారు. ప్రజలతో కొద్దిసేపు గడిపిన మంత్రి.. గణేష్ ఉత్సవాల్లో పాల్గొనడం ద్వారా గ్రామస్థుల్లో ఉత్సాహం నింపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివర ప్రసాద్, కింజరాపు సురేష్, గ్రామ ప్రజలు, ఉత్సవ కమిటీ సభ్యులు, నాయకులు, యువత, భక్తులు పాల్గొన్నారు.

## దేవతలగుట్టపై నిమజ్జనంతో ముగిసిన వినాయక చవితి వేడుకలు



బడంగ్ పేట (ప్రశ్న న్యూస్) దేవతలగుట్టపై ప్రతిష్టించిన వినాయకునికి గత 9 రోజులుగా విశేష పూజలు నిర్వహిస్తు అదివారం నాడు నిమజ్జన కార్యక్రమంతో ఈ సంవత్సరం వినాయక నవరాత్రి ఉత్సవాల చివరి అంకం ముగిసిందని దేవతలగుట్ట ఆలయ ధర్మకర్త మందాడి. శివారెడ్డి తెలిపారు. ఆదివారం నాడు ఉదయం ప్రత్యేక పూజలు, మహహారతి కార్యక్రమాలను నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాల వితరణ అనంతరం వినాయక స్వామిని ఆలయం వెలుపల హనుమాన్ విగ్రహ దిగువన అత్యంత సుందరంగా అలంకరించిన ఆసనం ఉంచి భక్తులందరు మనస్ఫూర్తిగా ప్రణమిల్లి స్వామి వారిని భక్తిశ్రద్ధలతో కీర్తిస్తు భజనలతో ఊరేగింపుగా మేళతాలలతో గుట్ట కింద సహజసిద్ధంగా ఏర్పడిన నీటి గుండంలో వినాయకుని నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

అలాగే శనివారం నాడు ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన భక్తులకు ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే వినాయకుని నిమజ్జనం కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు ధన్యవాదాలు తెలియజేశారు.

### లక్కీ డ్రాలో వినాయక లడ్డు

దేవతలగుట్టపై ప్రతిష్టించిన వినాయకుని లడ్డను వినూత్నంగా రూ. 51 చెల్లించి లక్కీ డ్రా లో పాల్గొని లడ్డును సొంతం చేసుకోవాలనే మండప నిర్వాహకుల నిబంధనలకు అనుగుణంగా శనివారం నాడు సాయంత్రం వినాయక మండపంలో భక్తుల సమక్షంలో తీసిన డ్రాలో శ్రీ సాయిబాలాజీ హోమ్స్ కు చెందిన వికాస్ గౌడ్ లడ్డును సొంతం చేసుకున్నారని శివారెడ్డి తెలిపారు.

# తిరుమల లడ్డూ.. తరతరాల భక్తి పరిమళం

- 1480లో 'మనోహరం'గా మొదలైన ప్రసాద ప్రస్థానం.. - 1940లో లడ్డూ రూపం
- దిట్టం కొలతల్లో తయారీ.. నాణ్యతలో కచ్చితత్వం.. భక్తి విశ్వాసాల్లో చెరగని స్థానం
- ఒక్క ముద్దలో శతాబ్దాల చరిత్ర.. ఒక్క లడ్డూలో ఏడుకొండల అనుభూతి

(తిరుమల, శ్రీవారి సన్నిధి - ప్రత్యేక కథనం తోట వెంకట్, ప్రజా ప్రశ్న బ్యూరో, ఆంధ్రప్రదేశ్)









ఏడుకొండలు ఎక్కుతారు...
గోవింద నామస్మరణ చేస్తారు...
శ్రీవారిని దర్శించుకుంటారు...
ఆ తర్వాత ఇంటి బాట పడుతారు...
కానీ తిరుమల యాత్ర అక్కడితో ముగియదు.
భక్తుడి చేతిలో మిగిలే ఒక చిన్న ప్రసాదం ఆ యాత్రను ఇంటి వరకూ వెంట తీసుకెళ్తుంది. అదే

### శ్రీవారి లడ్డూ..

ఒక లడ్డూ చేతిలో పడగానే.. తిరుమల కొండలు గుర్తుకొస్తాయి. శ్రీవారి దర్శనం కళ్లముందు మెదులుతుంది. గోవింద నామస్మరణ చెవుల్లో మార్మోగుతుంది. ఇంట్లో పిల్లలు, పెద్దలు చుట్టూ చేరతారు. ఒకరు కొంచెం తింటారు.. మరొకరికి కొంచెం పంచుతారు. ఆ మధురమైన పంచుకోవడంలోనే ఒక కుటుంబ భక్తి కథ దాగి ఉంటుంది.
అందుకే తిరుమల లడ్డూ ఒక మిఠాయి కాదు.
అది దర్శనానికి జ్ఞాపకం.
అది భక్తికి ప్రతీక.

### అది తరాలకు అందే ప్రసాదం.

### శతాబ్దాల క్రితమే ప్రసాద ప్రస్థానం

ఈ రోజు మనం చూస్తున్న గుండ్రని లడ్డూ ఒక్కరోజులో రూపుదిద్దుకున్నది కాదు.తిరుమల ఆలయ ప్రసాదాల చరిత్రలో 1480 ప్రాంతానికి చెందిన శాసనాల్లో 'మనోహరం' అనే ప్రసాద ప్రస్తావన కనిపిస్తుందని టీటీడీ అధికారిక సమాచారం చెబుతోంది. అంటే శ్రీవారి ప్రసాద సంప్రదాయానికి కనీసం శతాబ్దాల చరిత్ర ఉందన్నమాట.

### కాలం మారింది.తయారీ విధానాలు మారాయి.

### భక్తుల సంఖ్య పెరిగింది.

ప్రసాదాల రూపాలు కూడా క్రమంగా పరిణామం చెందాయి.
1803 ప్రాంతంలో శ్రీవారి ప్రసాదంగా లడ్డూ తరహా ప్రసాదం ఉన్నట్లు టీటీడీ చరిత్రలో పేర్కొంటోంది.అయితే భక్తులకు నేడు పరిచయమైన గుండ్రని లడ్డూ రూపం 1940లో స్థిరపడింది. ఆ సమయంలో రోజుకు సుమారు వెయ్యి లడ్డూల తయారీతో మొదలైన ఈ ప్రయాణం.. నేడు రోజుకు లక్షల సంఖ్యకు చేరుకుంది.

### అంటే..ఒకప్పుడు వెయ్యి లడ్డూలు..

### నేడు లక్షల లడ్డూలు..కానీ భక్తి మాత్రం అదే

### బూందీ నుంచి లడ్డూగా.. రుచికి ప్రత్యేక రూపం..

ప్రసాదం ఎక్కువ కాలం నిల్వ ఉండేలా బూందీని పాకంలో కలిపే విధానం అభివృద్ధి చెందింది. అనంతరం జీడిపప్పు, కిస్మిస్, బాదం వంటి పదార్థాలు చేరాయి. వాటితో లడ్డూకు ప్రత్యేకమైన రుచి, వాసన, ఆకృతి ఏర్పడింది.
చేతిలోకి తీసుకున్న వెంటనే నెయ్యి పరిమళం...
నోట్లో వేసుకున్నప్పుడు మెత్తదనం...
మధ్య మధ్యలో తగిలే జీడిపప్పు, కిస్మిస్...

### కలకండ తీపి...

### యాలకుల సువాసన...

ఇవన్నీ కలిసే శ్రీవారి లడ్డూకు ఆ ప్రత్యేక రుచిని తీసుకొస్తాయి. అందుకే తిరుమల లడ్డూ రుచిని మరెక్కడా అదే విధంగా పునరావృతం చేయడం సాధ్యం కాదని భక్తులు భావిస్తారు.

### 'దిట్టం'.. రుచికి కనిపించని కొలమానం..

శ్రీవారి లడ్డూ తయారీలో అత్యంత ప్రాధాన్యం ఉన్న పదం 'దిట్టం'.దిట్టం అంటే ప్రసాదం తయారీలో ఉపయోగించే ముడి పదార్థాలు, వాటి పరిమాణాలకు సంబంధించిన నిర్దిష్ట ప్రమాణాలు.
అంటే..
ఎంత శెనగపిండి.?
ఎంత చక్కెర.?
ఎంత నెయ్యి.?
ఎంత జీడిపప్పు.?
ఎంత కిస్మిస్.?
ఎంత యాలకులు.?
ఇవన్నీ ఒక నిర్దిష్ట పద్ధతిలోనే ఉండాలి.
అంచనాకు తావులేకుండా.. రుచిలో తేడా రాకుండా.. నాణ్యతలో మార్పు లేకుండా దిట్టం ప్రమాణాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి.
టీటీడీ అధికారిక వివరాల ప్రకారం లడ్డూ తయారీలో దిట్టం ప్రమాణాలు దశాబ్దాలుగా అమలులో ఉన్నాయి.
అందుకే ఒక రోజు తిన్న లడ్డూ రుచి.. మరోసారి తిన్నా అదే తిరుమల రుచిని గుర్తు చేస్తుంది.

### రోజుకు 68 టన్నుల ముడి పదార్థాలు..

భక్తుడి చేతిలో కనిపించేది ఒక లడ్డూ.
కానీ ఆ ఒక్క లడ్డూ వెనుక పనిచేసే వ్యవస్థ ఎంత పెద్దదో లెక్కలు చెబుతున్నాయి. 2026 జూన్‌లో టీటీడీ వెల్లడించిన వివరాల ప్రకారం సాధారణంగా రోజుకు సుమారు 4 లక్షల నుంచి 4.5 లక్షల వరకు లడ్డూలు తయారవుతున్నాయి. ఇందుకోసం రోజుకు సుమారు 68 టన్నుల ముడి పదార్థాలు వినియోగిస్తున్నట్లు టీటీడీ తెలిపింది.
అందులో సుమారు–
32 టన్నుల చక్కెర
16 టన్నుల శెనగపిండి
16 టన్నుల నెయ్యి
3.5 టన్నుల జీడిపప్పు
2 టన్నుల కిస్మిస్
400 కిలోల యాలకులు
800 కిలోల కలకండ
వినియోగిస్తున్నట్లు టీటీడీ వివరించింది.



ఒక సాధారణ లడ్డూ తయారీలో సుమారు 167–170 గ్రాముల ముడి పదార్థాలు ఉపయోగిస్తున్నట్లు కూడా టీటీడీ పేర్కొంది. అంటే.. భక్తుడి చేతిలోని చిన్న లడ్డూ వెనుక భారీ స్థాయి సరఫరా వ్యవస్థ, తయారీ, నాణ్యత నియంత్రణ, పంపిణీ వ్యవస్థ పనిచేస్తోంది.

### నెయ్యి.. లడ్డూ ప్రాణం..

### లడ్డూ రుచిలో నెయ్యిదే కీలక పాత్ర.

నెయ్యి నాణ్యత మారితే రుచి, వాసనలో కూడా తేడా వస్తుంది. 2024లో లడ్డూ నాణ్యత, రుచి మెరుగుపరచడంపై దృష్టి పెట్టిన టీటీడీ.. నందిని నెయ్యిని వినియోగించేందుకు చర్యలు చేపట్టినట్లు అధికారికంగా ప్రకటించింది. నెయ్యి నాణ్యత లడ్డూ రుచిపై గణనీయమైన ప్రభావం చూపుతుందని నిపుణుల అభిప్రాయాన్ని కూడా టీటీడీ అప్పట్లో వెల్లడించింది.2026లోనూ లడ్డూ తయారీకి అవసరమైన నెయ్యి నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని టీటీడీ స్పష్టం చేసింది.నెయ్యి పరిమళమే లడ్డూ పరిమళానికి మొదటి మెట్టు.

### నాణ్యత.. ప్రతి అడుగులో పరీక్ష!

శ్రీవారి లడ్డూ విషయంలో రుచి ఎంత ముఖ్యమో.. నాణ్యత కూడా అంతే ముఖ్యమైనది.ముడి పదార్థాల ఎంపిక నుంచి తయారీ వరకు పర్యవేక్షణ కొనసాగుతోంది.2026లో తిరుమలలో ఆధునిక ఫుడ్ అండ్ వాటర్ అనాలిసిస్ ల్యాబొరేటరీ అందుబాటులోకి వచ్చింది. టీటీడీ ప్రకారం ఈ ప్రయోగశాలలో 50కి పైగా ఆధునిక పరికరాలు, సుమారు 30 మంది శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు.మరోవైపు ముడి పదార్థాల్లో మలినాలను గుర్తించేందుకు ఆధునిక కలర్ సార్టింగ్ సాంకేతికతను కూడా ఉపయోగిస్తున్నట్లు టీటీడీ తెలిపింది.
అంటే.. లడ్డూ రుచి వెనుక సంప్రదాయం ఉంటే..నాణ్యత వెనుక ఆధునిక విజ్ఞానం ఉంది.

### పవిత్రత.. ఆహారాన్ని ప్రసాదంగా మార్చే భావన..

మిఠాయి తింటే రుచి.
కానీ ప్రసాదం స్వీకరిస్తే భక్తి.
ఇదే శ్రీవారి లడ్డూకు ఉన్న ప్రత్యేకత.
ఆలయ సంప్రదాయంలో నైవేద్యానికి ఉన్న ఆధ్యాత్మిక ప్రాధాన్యం కారణంగా.. భక్తుడు లడ్డూను కేవలం కొనుగోలు చేసిన ఆహార పదార్థంగా చూడడు.

### 'స్వామివారి ప్రసాదం'గా స్వీకరిస్తాడు.

అందుకే చాలామంది భక్తులు లడ్డూను ఎంతో భక్తిశ్రద్ధలతో ఇంటికి తీసుకెళ్లి.. కుటుంబ సభ్యులతో పంచుకుంటారు.
కొంతమంది పూజామందిరంలో ఉంచి నమస్కరిస్తారు.
ఇంకొందరు బంధువులకు పంపిస్తారు.
లడ్డూ ఒకరి చేతి నుంచి మరొకరి చేతికి వెళ్లే కొద్దీ.. దాని విలువ తగ్గదు. భక్తి మాత్రం పెరుగుతుంది.
శ్రీవారి లడ్డూ అంటే ఒకే పరిమాణం అని భావించడం సరికాదు. టీటీడీ అధికారిక వివరాల్లో పెద్ద లడ్డూ, చిన్న లడ్డూ, మినీ లడ్డూ వంటి పరిమాణాల ప్రస్తావన ఉంది. కొన్ని ధార్మిక కార్యక్రమాలకు ప్రత్యేక పరిమాణాల్లో లడ్డూలను అందించే విధానం కూడా ఉంది.అలాగే కల్యాణోత్సవ లడ్డూ ప్రత్యేక సేవతో అనుబంధమై ఉంటుంది. అంటే లడ్డూ రకాలను కేవలం రుచితో కాకుండా
పరిమాణం..సేవ..కార్యక్రమం..వినియోగం..
వంటి అంశాల ఆధారంగా చూడాలి.
గుండ్రని ఆకారం.. గుండెల్లో స్థానం!
లడ్డూ గుండ్రంగా ఉంటుంది.
కానీ దాని చుట్టూ తిరిగే జ్ఞాపకాలు మాత్రం అంతులేనివి.
తిరుమల వెళ్లిన తాత ఒక లడ్డూ తీసుకొచ్చాడు.
తండ్రి తిరుమల వెళ్లి పిల్లలకు లడ్డూ పంచాడు.
కొడుకు తిరుమల వెళ్లి తల్లిదండ్రుల చేతిలో లడ్డూ పెట్టాడు.
ఇలా.. లడ్డూ ఒక తరం నుంచి మరో తరానికి ప్రయాణించింది.
ఇంటి పూజామందిరంలోకి వెళ్లింది.
బంధువుల ఇళ్లకు వెళ్లింది.
విదేశాల్లో ఉన్న పిల్లల దగ్గరికీ చేరింది.
తిరుమల కొండకు వెళ్లలేని వారికి కూడా.. ఎవరో ఒకరు తీసుకెళ్లి అందించారు.
అప్పుడు ఆ లడ్డూ ఒక మిఠాయి కాదు.
'నీ కోసం తిరుమల నుంచి తీసుకొచ్చాను' అనే ప్రేమ మాటగా మారింది.
కోట్లాది భక్తుల చేతుల్లోకి..
భక్తుల సంఖ్య పెరుగుతున్న కొద్దీ లడ్డూ తయారీ కూడా భారీ స్థాయికి చేరింది.
2026 ఏప్రిల్‌లో 1,11,96,170, మేలో 1,21,35,528, జూన్‌లో 1,26,81,805 లడ్డూలు విక్రయించినట్లు టీటీడీ ప్రకటించింది. జూన్ నెల విక్రయాలు ఆ కాలానికి రికార్డు స్థాయిలో నమోదయ్యాయి.
ఈ సంఖ్యలు ఒక విషయం చెబుతున్నాయి.
తిరుమల దర్శనం పూర్తయిన తర్వాత లడ్డూ తీసుకెళ్లాలనే భక్తుల ఆకాంక్ష ఎంత బలంగా ఉందో
జిఐ గుర్తింపు.. ప్రత్యేకతకు అధికారిక ముద్ర
శ్రీవారి లడ్డూకు భౌగోళిక గుర్తింపు (జిఐ ట్యాగ్ ) లభించింది.
తిరుమల లడ్డూ పేరుతో ఇతరులు దుర్వినియోగం చేయకుండా.. దాని ప్రత్యేకతకు సంబంధించిన మేధో సంపత్తిని రక్షించేందుకు టీటీడీ (జిఐ) గుర్తింపు కోసం దరఖాస్తు చేసింది. టీటీడీ అధికారిక సమాచారం ప్రకారం 2009లో ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది.
అంటే..
ఏడు కొండలపై పుట్టిన ఆ ప్రసాదానికి.. దాని పేరుకే ఒక అధికారిక రక్షణ లభించింది.

### తరాలు మారినా.. లడ్డూ కథ మారలేదు..

తాతకు తిరుమల అంటే లడ్డూ.
తండ్రికి తిరుమల అంటే లడ్డూ.
మనకు తిరుమల అంటే లడ్డూ.
రేపటి పిల్లలకు కూడా తిరుమల అంటే లడ్డూనే గుర్తుకు రావాలి.
అందుకే ఈ ప్రసాదం కేవలం రుచిని కాపాడుకోవడం కాదు.
ఒక సంప్రదాయాన్ని కాపాడుకోవడం.
ఒక భక్తి భావాన్ని కాపాడుకోవడం.
ఒక చారిత్రక వారసత్వాన్ని కాపాడుకోవడం.
సాంకేతికత ఎంత పెరిగినా...
యంత్రాలు ఎన్ని వచ్చినా...
తయారీ పరిమాణం ఎన్ని లక్షలకు చేరినా...
భక్తుడి చేతిలోకి వచ్చినప్పుడు మాత్రం అది ఒకటే శ్రీవారి ప్రసాదం.

### పది తరాలు చెప్పుకునే పరిమళం..

ఒక లడ్డూలో ఎంత చక్కెర ఉందో లెక్కించవచ్చు.
ఎంత నెయ్యి ఉందో కొలవచ్చు.
ఎన్ని జీడిపప్పులు ఉన్నాయో లెక్కించవచ్చు.
ఎంత బరువు ఉందో తూకం వేయవచ్చు.
కానీ...
దాన్ని చేతిలోకి తీసుకున్న భక్తుడి కళ్లలో కనిపించే ఆనందాన్ని మాత్రం కొలవలేం.
ఆనందానికి కొలమానం లేదు.
భక్తికి తూకం లేదు.
ప్రసాదానికి ధర ఉండొచ్చు..
కానీ పవిత్రతకు ధర ఉండదు.
అందుకే తిరుమల లడ్డూ చరిత్ర అనేది కేవలం ఒక ప్రసాదం తయారీ చరిత్ర కాదు.
అది శతాబ్దాల ఆలయ సంప్రదాయం.
అది భక్తి నుంచి భక్తికి సాగిన ప్రయాణం.
అది కుటుంబం నుంచి కుటుంబానికి పంచుకున్న మధుర జ్ఞాపకం.అది తరాల నుంచి తరాలకు అందిన ఆధ్యాత్మిక వారసత్వం.1480లో 'మనోహరం'గా కనిపించిన ప్రసాద సంప్రదాయం...
1803 ప్రాంతంలో లడ్డూ ప్రసాద పరిణామానికి చేరి...1940లో నేటి గుండ్రని రూపాన్ని సంతరించుకుని...
దిట్టం ప్రమాణాలతో తన ప్రత్యేకతను నిలబెట్టుకుని...
ఆధునిక నాణ్యత నియంత్రణతో కోట్లాది భక్తుల చేతుల్లోకి చేరింది.

### ఒకప్పుడు వెయ్యి లడ్డూల ప్రయాణం..

### నేడు లక్షల లడ్డూల వైభవం..

కానీ భక్తుడి మనసులో దాని స్థానం మాత్రం మారలేదు.
రేపు మన మనవళ్లు తిరుమల కొండలు ఎక్కుతారు.
ఎల్లుండి వారి పిల్లలు ఏడుకొండలపై గోవింద నామస్మరణ చేస్తారు. అప్పుడు కూడా దర్శనం అనంతరం వారి చేతిలో ఒక లడ్డూ ఉండాలి.
దాన్ని చూసి వారు అడగాలి–
"తాతయ్యా.. ఈ లడ్డూ కథ ఏమిటి?"
అప్పుడు సమాధానం ఒక్కటే ఉండాలి...
"ఇది మిఠాయి కాదు నాయనా...
ఇది మన కుటుంబం తరతరాలుగా నమ్ముకున్న శ్రీవారి ప్రసాదం. ఇది తిరుమల జ్ఞాపకం. ఇది గోవిందుడి అనుగ్రహం.
ఇది మన భక్తి వారసత్వం..."
అదే శ్రీవారి లడ్డూ.
అదే తిరుమల లడ్డూ మహిమ.
అదే పది తరాలు చెప్పుకునే భక్తి పరిమళం
**గోవిందా... గోవిందా**

## ఆటోను ధ్వంసం చేసిన మహిళ..



న్యూఢిల్లీ: తన కారును ఆటో స్వల్పంగా ఢీకొట్టడంతో ఒక మహిళ ఆగ్రహం చెందింది. ఆ ఆటోపై తన ప్రతాపాన్ని చూపింది. హెడ్‌లైట్, వైపర్‌ను ధ్వంసం చేసింది. ఆటో డ్రైవర్‌ను ఆ మహిళ దూషించింది. తనను ఎవరూ ఏమీ చేయలేరని ఆమె అన్నది. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. (ఓశీఖఱ ఋఱఅఱశ్రీఅంవం ఖబ్శీ) దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. హైదర్‌పూర్ బాద్లీ మోర్ మెట్రో స్టేషన్ వద్ద రోడ్డుపై వెళ్తున్న కారును ఒక ఆటో స్వల్పంగా రాసుకున్నది. ఈ నేపథ్యంలో ఆ కారులోని మహిళ ఆగ్రహించింది. ఆటో డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగింది. అంతటితో ఆగక ఆ ఆటోను ధ్వంసం చేసింది. హెడ్‌లైట్‌తో పాటు వైపర్‌ను విరిచేందుకు ప్రయత్నించింది. ఆటో డ్రైవర్‌ను దూషించడంతో పాటు, తాను సిబ్బందినని, తనపై ఎలాంటి చర్య తీసుకోరని ఆమె అన్నది. కాగా, ఆ సమయంలో బైక్‌పై అటుగా వెళ్తున్న విశాల్ అనే రాపిడో డ్రైవర్ ఈ గొడవను గమనించాడు. ఆ మహిళ ఆటోను ధ్వంసం చేసిన వీడియోను రికార్డ్ చేశాడు. తన ఇన్‌స్టాగ్రామ్‌లో అతడు షేర్ చేయడంతో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో ఆ మహిళ ప్రవర్తనను నెటిజన్లు తప్పుపట్టారు. ఆటోకు జరిగిన నష్టానికి సంబంధించి ఆమెపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ పోలీసులకు ఈ వీడియో క్లిప్‌ను ట్యాగ్ చేశారు. కారు నంబర్ ఆధారంగా ఆ మహిళను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు.

## చంద్రబాబు, లోకేష్‌కు డబ్బు పిచ్చి పట్టింది

### – మాజీ మంత్రి పేర్నినాని



అమరావతి : వైసీపీ మాజీ మంత్రి పేర్ని నాని ఏపీలోని కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ముఖ్యంగా చంద్రబాబు , నారా లోకేష్ డబ్బు పిచ్చిపట్టిందని విమర్శించారు. ఆదివారం కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గ వైసీపీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో చంద్రబాబు తన ధన బలంతో ఓటర్లను ప్రలోభ పెడతారని , కార్యకర్తలు జాగ్రత్తగా ఉండాలని పిలుపునిచ్చారు. ఓటర్లను డబ్బుతో కాదు ప్రేమతో కొనాలని సూచించారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని, గ్రామాల్లో వైసీపీ జండా రెపరెపలాడాలని కోరారు. కూటమి ప్రభుత్వంలో రైతులకు కరెంట్ కోతలు, ఎరువులు అందడం లేదని ఆరోపించారు.రైతు కన్నీరు పెడితే ప్రభుత్వాలు కూలిపోతాయని వెల్లడించారు. 2024లో జరిగిన సాధారణ ఎన్నికల్లో వైఎస్ జగన్‌ను వదులుకున్నామని జనం బాధపడుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో దౌర్భగ్య పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు.

## రైలు బోగిలో పాము ప్రత్యక్షం.. భయంతో వణికిన ప్రయాణికులు..



ఓ రైలు కంపార్ట్‌మెంట్ లో పాము ప్రత్యక్షం కావడం ప్రయాణికులను తీవ్ర భయాందోళనకు గురిచేసింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియా లో పంచుకున్న కాంగ్రెస్ పార్టీ .. కేంద్ర ప్రభుత్వంపై, రైల్వే శాఖ మంత్రి పై వ్యంగ్యాస్త్రాలు సంధించింది. ఇది రైలు ప్రయాణం కాదని, రైల్వే శాఖ అందిస్తున్న 'జంగిల్ సఫారీ అని ఎద్దేవా చేసింది.ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ తమ అధికారిక సోషల్ మీడియా ఖాతాలో ఓ వీడియోను పోస్ట్ చేసింది. ఆ వీడియోలో రైలు బోగీలోని ఓ బెర్త్ కింద పాము కదులుతూ కనిపించింది. ఈ వీడియోకు ఘాటైన వ్యాఖ్యను జోడించింది. ఇకపై భారతీయ రైల్వేలో 'జంగిల్ సఫారీ' థ్రిల్‌ను కూడా పొందండి అంటూ ఎద్దేవా చేసింది. ఇదిగో రైల్లో మీతో ప్రయాణిస్తున్న ఈ సర్పరాజు మీకు ఆ థ్రిల్‌ను అందిస్తాడు అని వ్యాఖ్యానించింది. ప్రయాణికుల భద్రతకు వాళ్లే బాధ్యులని, బలవంతంగా ఛార్జీలు పిండుకునే 'రీల్ మినిస్టర్'కు మీ ప్రాణాలంటే ఏమాత్రం లెక్కలేదని కాంగ్రెస్ తీవ్రంగా విమర్శించింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రయాణికుల భద్రత విషయంలో రైల్వే శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనడానికి ఇదే నిదర్శనమని పలువురు నెటిజన్లు, విపక్ష నేతలు కామెంట్లు చేస్తున్నారు.

### వినాయక నిమజ్జనంలో ఊరేగింపులో విషాదం..

## డ్యాన్స్ చేస్తూ వృద్ధుడు మృతి



అమరావతి : ఉల్లాసంగా కొనసాగుతున్న వినాయక నిమజ్జనం ఊరేగింపులో లో ఒక్కసారిగా విషాదం చోటు చేసుకుంది. ఎంతో భక్తిశ్రద్ధలతో విగ్రహాలను నెలకొల్పి నిత్యం పూజలు చేసిన ఆ కాలనీవాసులకు ఆదివారం చేదు అనుభవం ఎదురైంది. విశాఖ జిల్లా ఎండాడ గ్రామంలో ఆదివారం వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు మండపం వాసులు డప్పు, వాయిద్యాలతో బయలు దేరారు. దారి పొడవున సంగీతానికి అనుగుణంగా చిన్న వయస్సు నుంచి పెద్ద వయస్సు గల వారందరూ నృత్యాలు చేశారు. వీరిలో శంకర్రావు (62) అనే వృద్ధుడు డ్యాన్స్ చేస్తూ గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతి చెందడంతో నిమజ్జన ఊరేగింపులో విషాదం అలుముకుంది.

# అడవి నేపథ్యంలో వైల్డ్ యాక్షన్‌తో సత్యదేవ్..

## - 'సమవర్తి' టీజర్ రిలీజ్




వర్సటైల్ ట్యాలెంటెడ్ హీరో సత్యదేవ్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న లేటెస్ట్ ఎకోలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ 'సమవర్తి'. అజయ్ నాగ్ వి. దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాకు సంబంధించి మేకర్స్ తాజాగా అధికారిక టీజర్‌ను లాంచ్ చేశారు. విభిన్నమైన కథాంశంతో వస్తున్న ఈ టీజర్ ప్రస్తుతం సినీ వర్గాల్లో మరియు ప్రేక్షకులలో తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రకృతికి, మానవులకు మధ్య నడిచే సంఘర్షణ, అడవుల అక్రమ నరికివేత, గిరిజనుల జీవన విధానం వంటి సరికొత్త పాయింట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. టీజర్ ఆరంభంలో వచ్చే వైవిధ్యమైన వాయిస్ ఓవర్ కథపై ఆసక్తిని కలిగిస్తుంది. ఇక ఈ చిత్రంలో 'మహాదేవ్' అనే వైల్డ్ అండ్ రగ్డ్ పాత్రలో సత్యదేవ్ కనిపించనున్నారు. ఆయన గెటప్, తెలంగాణ యాసలో చెప్పే పవర్‌ఫుల్ డైలాగులు, ముఖ్యంగా టీజర్ ముగింపులో వచ్చే "ఈసారి మిస్ అవ్వదు" అనే డైలాగ్ సినిమాపై హైప్‌ను తారాస్థాయికి చేర్చాయి.ప్రపంచ పటాలు పరిశీలించండి అడవులు, ప్రత్యేకమైన లొకేషన్లలో అత్యంత సహజసిద్ధంగా తెరకెక్కించిన విజువల్స్ ఈ సినిమాకి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. చివరిలో చూపించిన పులి ఎంట్రీ సీన్ మరింత ఉత్కంఠను రేకెత్తిస్తోంది. ఇందులో దిలీష్ పోతన్, రాజీవ్ కనకాల, గానవి లక్ష్మణ్, రవీంద్ర విజయ్, మోహన్ భగత్ వంటి ప్రముఖ తారాగణం నటిస్తోంది. సింజిత్ యర్రమిల్లి సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని రుద్ర పిక్చర్స్ మరియు పంచభూత ప్రొడక్షన్స్ సంస్థలు అత్యున్నత నిర్మాణ విలువలతో భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాయి. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో

# అందానికి అమ్మమ్మ చిట్కా



'ఛలో' సినిమాతో టాలీవుడ్‌లో అడుగుపెట్టిన కన్నడ కస్తూరి రష్మిక మందన్న. ఈ ముద్దుగుమ్మ హీరో విజయ్ దేవరకొండను పెండ్లి చేసుకొని తెలంగాణ కోడలైంది. పుష్ప లాంటి బ్లాక్‌బస్టర్‌లో నటించిన రష్మిక తన భర్త విజయ్‌తో కలిసి 'రణబాలి'లో జతకట్టింది. ముచ్చటగా మూడోసారి దేవరకొండతో నటిస్తున్నా.. పెండ్లి తర్వాత ఈ జంట కలిసి చేస్తున్న మొదటి చిత్రం ఇదే కావడం విశేషం. ఈ సందర్భంగా ఈ బ్యూటీ పంచుకున్న కార్వాన్ కబుర్లివి.. ఇటీవల షూటింగ్‌లో గాయపడటంతో ఇంటికే పరిమితమయ్యాను. ఇన్నిరోజులు ఇంట్లో ఉండటం నా కెరీర్‌లోనే మొదటిసారి అనుకుంటా. షూటింగ్‌ల వల్ల నిత్యం ఒక చోటు నుంచి మరో చోటుకువెళ్లే నాకు ఇదో కొత్త అనుభవం. పెండ్లయిన తర్వాత కూడా విజయ్, నేను మూడు నెలలపాటు ఒకరినొకరం చూసుకోలేదు. పెండ్లి తర్వాత ఇంట్లోవాళ్లతో గడిపే అవకాశం లభించినందుకు ఒకింత సంతోషంగా ఉంది. రణబాలితో పాటు 'మైసా'లో లీడ్ రోల్ చేస్తున్నాను. ఇందులో గోండు తెగకు చెందిన వారియర్‌లా కనిపిస్తాను. ఈ పాత్ర కోసం శారీరకంగా, మానసికంగా ఎంతో కఠిన శిక్షణ తీసుకున్నాను. ఇందులో నీటి అడుగున శ్వాస బిగబట్టి చేసే యాక్షన్ సీన్ చేశాను. ఆసియాలోనే ఈ తరహా సీన్ చేసిన తొలి ఫీమెల్ యాక్టర్ నేనే అనుకుంటా. దేవరకొండ కుటుంబంలో భాగమైనందుకు ఆనందంగా ఉంది. మా అత్త స్వీట్‌గా, పసిపాపలాగా అమాయకంగా ఉంటుందని నేను ముద్దుగా ఆమెను 'పాపా' అని పిలుస్తాను. విజయ్‌కు సీరియస్ డ్రామాలు, షోలంటే ఇష్టం. నాకేమో కొరియన్ డ్రామాలు అంటే పిచ్చి. ఇప్పుడు ఆయనకు కూడా కే-డ్రామాలు అలవాటు చేశాను. నా దృష్టిలో సక్సెస్ అంటే పర్‌ఫెక్ట్ ఇమేజ్ కాదు. ఎంత ఎదుగుతున్నా సరే మనం మనలా ఉంటూ ప్రేక్షకులతో నిజాయతీగా ఉండటమే. అలాంటి నిజాయతీని ఎప్పటికైనా ప్రేక్షకులు గుర్తిస్తారు. బిజీ షెడ్యూల్లో కాస్త తీరిక దొరికినప్పుడు స్కిన్, హెయిర్ కేర్ గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాను. గోరు వెచ్చని కొబ్బరి నూనెను ముఖానికి, తలకు పట్టించి చక్కగా మర్దనా చేసుకుంటా. ఏ మాయిశ్చరైజర్, హెయిర్ కండీషనర్ అవసరం లేదు. వీలు దొరికినప్పుడల్లా నేను ఇదే చేస్తా. ఇది మా అమ్మమ్మ, అమ్మ చెప్పిన చిట్కా.

# 'సంగీత్' స్వరప్రయాణం



యువతరం ప్రేమకథగా తెరెక్కుతున్న చిత్రం 'సంగీత్'. నిఖిల్ విజయేంద్రసింహా కథానాయకుడు. తేజు అశ్విని కథానాయిక. సాద్‌ఖాన్ దర్శకత్వంలో నవీన్ మనోహరన్, చంద్రు మనోహరన్, స్రవంతి నవీన్ నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్నది. మ్యూజిక్ ప్రమోషన్స్‌లో భాగంగా ఈ సినిమా నుంచి తొలి పాటగా 'నీవల్లే..' అని సాగే రొమాంటిక్ మెలొడీని మేకర్స్ విడుదల చేశారు. విక్రమ్ శివ రాసిన ఈ పాటను అచు రాజామణి స్వరపరచగా, సిద్ శ్రీరామ్ ఆలపించారు. ప్రేమ, భావోద్వేగాలను ఈ పాట అద్భుతంగా ఆవిష్కరించిందని, ప్రస్తుతం డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో ఈ పాట విశేష ఆదరణ పొందుతున్నదని మేకర్స్ చెబుతున్నారు. హీరో నిఖిల్ విజయేంద్రసింహా, తేజు అశ్విని మధ్య కెమిస్ట్రీ ఈ పాటకు హైలైట్‌గా నిలుస్తుందని వారన్నారు. ఈ చిత్రానికి కెమెరా: వెంకట్ గంగాధరి, సమర్పణ: జి.మనోహరన్ అండ్ ఎల్.బాలకృష్ణ, నిర్మాణం: లహరి ఫిల్మ్స్ అండ్ ఆర్‌బీ స్టూడియోస్.

# 'గుడ్ బాయ్స్' గ్రూప్‌కి లీడర్‌గా



వెన్నెల కిశోర్, శృతి సోధి, రవిరాజా, వైవా హర్ష ప్రధాన పాత్రలు పోషిస్తున్న కామెడీ ఎంటర్‌టైనర్ 'గుడ్ బాయ్స్'. రాఘవ్ దర్శకుడు. సూర్య గుణ్ణం, వివేక్ ఇనంపూడి, నవ్య శశాంక్ కనకమేడల నిర్మాతలు. ప్రస్తుతం ఈ సినిమా నిర్మాణ దశలో ఉన్నది. శనివారం వెన్నెల కిశోర్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా మోషన్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన వచ్చిందని మేకర్స్ ఆనందం వెలిబు చ్చారు. ఇందులో వెన్నెలకిశోర్ క్రేజీ గ్యాంగ్‌ని లీడ్ చేసే లీడర్‌గా కనిపిస్తారని మోషన్ పోస్టర్ చెబుతున్నది.స్టైలిష్ గా, గందరగోళంగా ఉన్న గ్యాంగ్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. వెన్నెల కిశోర్ కామెడీ ఈ సినిమాకు హైలైట్‌గా నిలుస్తుందని, స్నేహంతో కూడిన పూర్తి వినోదాత్మక చిత్రం ఇదని మేకర్స్ చెబుతున్నారు. వామ్సీ గౌడ్, గుండు సుదర్శన్, హైపర్ ఆది ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: గౌతమ్ గోవిందరాజన్

# చాలెంజింగ్ పాత్రతో 'ఇట్లు అర్జున'



వెంకీ కుడుముల నిర్మాతగా వాట్ నెక్స్ట్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై నిర్మిస్తున్న చిత్రం 'ఇట్లు అర్జున'. అనీష్ కథానాయకుడిగా పరిచయం అవుతున్నారు. అనస్వర రాజన్ కథానాయిక. మహేశ్ ఉప్పల దర్శకుడు. అక్టోబర్ 30న సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌ని హైదరాబాద్‌లో నిర్వహించారు. నిర్మాత వెంకీ కుడుముల మాట్లాడుతూ 'రష్మికను తెలుగుతెరకు పరిచయం చేసినందుకు గర్వంగా ఉండేది. ఇప్పుడు అనీష్‌ని పరిచయం చేస్తున్నందుకు అంతే గర్వపడుతున్నా. తను ఈ సినిమాలో అద్భుతంగా నటించాడు. దర్శకుడు మహేశ్ చాలా టాలెంటెడ్. తను చెప్పిన కథ తెరపై చూసినప్పుడు చాలా సంతృప్తిగా అనిపించింది. అనస్వర రాజన్ ఈ సినిమాకు ప్రధాన బలం. సాంకేతికంగా కూడా సినిమా రిచ్‌గా ఉంటుంది' అని తెలిపారు. ఇది తాను తెలుగులో సైన్ చేసిన తొలి సినిమా అని, అందుకే ఈ సినిమా తనకు ప్రత్యేకమని, ఇందులో 'కీర్తి' పాత్రను ఎంజాయ్ చేస్తూ పోషించానని, ఈ పాత్రలో ఉండే అమాయకత్వం, హ్యాపీనెస్‌ని ఎంజాయ్ చేశానని అనస్వర రాజన్ చెప్పారు. అవకాశం ఇచ్చిన నిర్మాతకు దర్శకుడు మహేశ్ ఉప్పల కృతజ్ఞతలు చెప్పాడు. మంచి కంటెంట్ ఉన్న సినిమా ఇదని ఆయన తెలిపారు. ఇంకా హీరో అనీష్, మానసశర్మ కూడా మాట్లాడారు.

## 'హనుమాన్ అంశ్'

# దర్శకుడి కొత్త సినిమా



ఇటీవల విడుదలైన ఆధ్యాత్మిక చిత్రం 'హనుమాన్ అంశ్'తో దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించారు దర్శకుడు విశాల్ చతుర్వేది. నీమ్ కరోలి బాబా జీవితం ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రం 300కోట్లకు పైగా వసూళ్లతో భారతీయ బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతున్నది. ఈ నేపథ్యంలో దర్శకుడు విశాల్ చతుర్వేది కొత్త చిత్రాన్ని ప్రకటించారు.. మహాకవి గోస్వామి తులసీదాస్ జీవిత కథతో ఆయన ఈ చిత్రాన్ని రూపొందించబోతున్నారు. దీనికి 'రాంబోలా- ది ఇమ్మోర్టల్ స్టోరీ ఆఫ్ గోస్వామి తులసీదాస్' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. తులసీదాస్ జీవిత ప్రయాణం, సాహిత్య సేవ, సమాజంపై ఆయన ప్రభావం వంటి అంశాలను చర్చిస్తూ ఈ సినిమాను తెరకెక్కించబోతున్నారు.

# ఫోకస్ అంతా యాక్టింగ్ పైనే!



తన అందచందాలతో నిత్యం వార్తల్లోకెక్కే బాలీవుడ్ బ్యూటీ దిశా పటానీ తన స్థాయిని హాలీవుడ్ వరకు విస్తరించుకొని ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్, సినిమాల ఎంపిక, హాలీవుడ్ ప్రాజెక్ట్ విశేషాలను పంచుకుంది. త్వరలోనే 'హోలీగార్డ్స్ సాగా- ది పోర్టల్ ఆఫ్ ఫోర్స్' అనే హాలీవుడ్ చిత్రంలో కనిపించనుంది. ఇందులో 'జెస్సికా' అనే కీలక పాత్ర పోషిస్తున్నది. దిశా ఈ ప్రాజెక్ట్ గురించిన విశేషాలను పంచుకుంటూ.. ఆడిషన్ ప్రక్రియ నుంచి షూటింగ్ వరకు ప్రతీ క్షణాన్ని ఎంతో ఆస్వాదించినట్లు తెలిపింది. ప్రాజెక్ట్ రేంజ్ గురించి కాకుండా.. తన నటనపై మాత్రమే పూర్తి దృష్టి కేంద్రీకరించినట్లు స్పష్టం చేసింది. కొత్త ప్రయాణంలో ఒత్తిడి సహజమే అయినప్పటికీ, దానిని పకన పెట్టి పనిలో అనుభవాన్ని పొందేందుకే ప్రాధాన్యం ఇస్తానని పేర్కొంది. 'గ్లామర్ అనేది నా వృత్తిలో ఒక భాగం మాత్రమే.

కానీ, ఒక నటిగా నా అభినయంతో ప్రేక్షకుల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించుకోవాలని అనుకుంటాను' అని ఆమె చెప్పుకొచ్చింది. ప్రపంచవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన ప్రతిభావంతులతో పనిచేయడం, పూర్తిగా భిన్నమైన సెటప్‌లో చిత్రీకరణ జరుపుకోవడం తనకు సరికొత్త అనుభూతిని ఇచ్చినట్లు ఈ బ్యూటీ తన అభిప్రాయాలను పంచుకున్నది. ఈ హాలీవుడ్ ప్రయాణం తనను కంఫర్ట్ జోన్ నుంచి బయటికి తీసుకువచ్చిందని, భవిష్యత్తులో కూడా తనలోని రకరకాల భావోద్వేగాలను, నటనలోని కొత్త కోణాలను వెలికితీసే విలక్షణ పాత్రలనే ఎంచుకోవడానికి ఇదో ప్రేరణగా నిలిచిందని దిశా అభిప్రాయపడింది.

# ఓటీటీలోకి ఎం.ఎస్. రాజు క్రేజీ థ్రిల్లర్ 'అగధ'..



ప్రముఖ దర్శకుడు ఎం.ఎస్. రాజు తెరకెక్కించిన తాజా సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రం 'అగధ'. కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి, ఉల్కా గుప్తా తదితరులు ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా ఆగస్ట్ 14వ తేదీన థియేటర్లలోకి వచ్చి ప్రేక్షకులను పలకరించింది. అయితే, విడుదలకు ముందు భారీ అంచనాలు క్రియేట్ చేసినప్పటికీ, బాక్సాఫీస్ వద్ద ఈ చిత్రం ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోయింది. సినిమాలోని కాన్సెప్ట్ కొత్తగా ఉన్నప్పటికీ, సాధారణ ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో కాస్త వెనుకబడిపోయింది. ఈ నేపథ్యంలో, థియేటర్లలో మెప్పించలేకపోయిన ఈ చిత్రం ఇప్పుడు ఓటీటీ ద్వారా మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమైంది. ప్రముఖ డిజిటల్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫాం జీ5 (జుజు5) ఈ సినిమా డిజిటల్ ప్రీమియర్ తేదీని అధికారికంగా ఖరారు చేసింది. సెప్టెంబర్ 25 నుంచి ఈ సినిమా జీ5 వేదికగా స్ట్రీమింగ్ కానుంది. మరి థియేట్రికల్ రన్‌లో విఫలమైన ఈ సినిమా, డిజిటల్ ఆడియన్స్‌ను ఏ విధంగా అలరిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఈ చిత్రంలో జోవికా విజయ్‌కుమార్, షిజు, రోషన్ బషీర్, శ్రేయ రాణి రెడ్డి తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటించారు. రాకేష్ వెంకటాపురం ఈ సినిమాకు సంగీతం అందించడమే కాకుండా పాటలను కూడా సమకూర్చారు. 'అగధ' అనే పదానికి లోతైన అంశం లేదా శూన్యం అని అర్థం. కంటికి కనిపించని దైవిక శక్తులు మరియు దెయ్యం లాంటి దుష్ట శక్తుల మధ్య జరిగే పవర్‌ఫుల్ పోరాటమే ఈ చిత్ర ప్రధాన కథాంశం. దేవుడికి వ్యతిరేకంగా పనిచేసే ఓ శక్తివంతమైన దుష్ట శక్తినే ఈ సినిమాలో 'అగధ'గా అత్యంత ఉత్కంఠభరితంగా చూపించారు.

# శ్రీవారి సేవకులకు వస్త్ర గౌరవం

**బ్రహ్మోత్సవ విధుల్లో ఉన్న 5 వేల మంది టీటీడీ సిబ్బందికి వేమిరెడ్డి దంపతుల బహుమానం**

**8 ఏళ్లుగా కొనసాగుతున్న సేవా కార్యక్రమం**



తిరుమల(ప్రశ్న న్యూస్) శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల నిర్వహణలో నిరంతరం సేవలందిస్తున్న టీటీడీ సిబ్బందిని గౌరవిస్తూ వేమిరెడ్డి దంపతులు వస్త్ర బహుమానం అందజేశారు. బ్రహ్మోత్సవ విధుల్లో నిమగ్నమైన దాదాపు 5 వేల మంది టీటీడీ సిబ్బందికి ఆదివారం వస్త్రాలను పంపిణీ చేశారు. శ్రీవారి సేవకులను గౌరవిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఇది ఎనిమిదో ఏడాది. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీటీడీ బోర్డు సభ్యురాలు, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆధ్వర్యంలో తిరుమలలోని వైభవోత్సవ మండపంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి చేతుల మీదుగా సిబ్బందికి వస్త్రాలను అందజేశారు.

### ప్రతి సేవకుడికీ గుర్తింపు

బ్రహ్మోత్సవాల విజయవంతమైన నిర్వహణలో ప్రత్యక్షంగా, పరోక్షంగా భాగస్వాములవుతున్న వివిధ విభాగాల సిబ్బందికి వస్త్రాలను అందించారు. ఆలయ అర్చకులు, పోటు సిబ్బంది, వాహన బేరర్లు, మంగళవాయిద్య బృందం, కల్యాణకట్ట సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, విద్యుత్తు విభాగం ఉద్యోగులతో పాటు టీటీడీకి అనుసంధానంగా వివిధ విభాగాల్లో సేవలందిస్తున్న సిబ్బందినీ కార్యక్రమంలో గౌరవించారు. స్వామివారి సేవలో నిరంతరం భాగస్వాములవుతున్న సిబ్బందిని గౌరవించడం, ప్రోత్సహించడం ప్రశంసనీయమని పేర్కొన్నారు.టీటీడీకి అవసరమైన సందర్భాల్లో, ఏదైనా సహాయం కోరినప్పుడు వేమిరెడ్డి దంపతులు వెంటనే స్పందించి అండగా నిలుస్తారని ఈవో తెలిపారు. శ్రీవేంకటేశ్వర స్వామివారిపై వారికి ఉన్న నిశ్చల భక్తికి, సేవానిరతికి ఈ కార్యక్రమం నిదర్శనమని అన్నారు. శ్రీవారి కృపాకటాక్షాలు వేమిరెడ్డి దంపతులు, వారి కుటుంబ సభ్యులపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

# హనుమంతుడిపై కోదండరాముడు

**భక్తి పారవశ్యంతో సాగిన హనుమంత వాహనసేవ**



తిరుమల(ప్రశ్న న్యూస్) శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజు ఆదివారం ఉదయం హనుమంత వాహనసేవ వైభవంగా జరిగింది. శ్రీమలయప్పస్వామివారు కోదండరాముని అలంకారంలో రామభక్తుడైన హనుమంతునిపై భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. వాహనం ముందు గజరాజులు గంభీరంగా నడుస్తుండగా.. భక్తజన బృందాల భజనలు, కోలాటాలు, జీయ్యంగార్ల ఘోష, మంగళవాయిద్యాల నడుమ సేవ సాగింది. విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులు మాడ వీధుల్లో అడుగడుగునా కర్పూర హారతులు సమర్పిస్తూ 'గోవిందా.. గోవిందా..' అంటూ స్వామివారిని దర్శించుకున్నారు.

### భక్తికి ప్రతిరూపం హనుమంతుడు

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజు ఉదయం శేషాచలాధీశుడు శ్రీరామావతారంలో తన పరమభక్తుడైన హనుమంతునిపై విహరించడం విశేషంగా భావిస్తారు. హనుమంతుడు అచంచల భక్తి, సేవాభావం, శరణాగతికి ప్రతీకగా నిలుస్తాడు. శ్రీరాముడు--హనుమంతుల దివ్య సంబంధం భక్తి, జ్ఞానం, సేవాతత్వాల సమన్వయాన్ని చాటిచెబుతుంది.హనుమంత వాహనంపై కోదండరాముని దర్శించుకోవడం ద్వారా భక్తుల్లో భగవద్భక్తి, ధర్మనిష్ఠ, శరణాగతి భావాలు మరింత పెంపొందుతాయని ఆధ్యాత్మిక విశ్వాసం.ఈ వాహనసేవలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీకృష్ణ, పలువురు బోర్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

# స్వర్ణరథంపై శ్రీవారి దివ్య విహారం

**గోవిందనామస్మరణతో మార్మోగిన తిరుమాడ వీధులు..**

**భక్తిశ్రద్ధలతో రథాన్ని లాగిన మహిళలు**



తిరుమల(ప్రశ్న న్యూస్) శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజు ఆదివారం సాయంత్రం స్వర్ణరథోత్సవం వైభవంగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు స్వర్ణరథంపై తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైన స్వర్ణరథోత్సవం మంగళవాయిద్యాల నడుమ కన్నులపండువగా సాగింది. స్వామివారి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో తిరుమాడ వీధులు కిక్కిరిశాయి. రథం ముందుకు సాగుతుండగా భక్తులు 'గోవిందా.. గోవిందా..' అంటూ గోవిందనామస్మరణతో మార్మోగించారు.

### స్వర్ణకాంతుల్లో శ్రీవారు

స్వర్ణకాంతులతో మెరిసిన రథంపై శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువుదీరిన శ్రీమలయప్పస్వామివారి దివ్యమంగళ స్వరూపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. స్వామివారి దర్శనం కోసం మాడ వీధుల వెంట వేచి ఉన్న భక్తులు కర్పూర హారతులు సమర్పిస్తూ భక్తిపారవశ్యంలో మునిగిపోయారు.

### రథాన్ని లాగిన మహిళలు

స్వర్ణరథోత్సవంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో రథాన్ని లాగుతూ గోవిందనామస్మరణ చేశారు. మహిళల భక్తి, మంగళవాయిద్యాల నడుమ స్వర్ణరథం తిరుమాడ వీధుల్లో ముందుకు సాగడం ఉత్సవానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

### సంపద.. ధాన్యసమృద్ధికి ప్రతీక

స్వర్ణరథోత్సవానికి ఆధ్యాత్మికంగా విశిష్ట స్థానం ఉందని భక్తుల విశ్వాసం. శ్రీదేవిని సంపదకు, భూదేవిని సమస్త ధాన్యసంపదకు ప్రతీకగా భావిస్తారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీమలయప్పస్వామివారు స్వర్ణరథంపై విహరించడం స్వామివారి వైభవానికి ప్రతీకగా భక్తులు భావిస్తారు. స్వర్ణరథోత్సవాన్ని దర్శించుకోవడం ద్వారా సకల శుభాలు, సుఖసంతోషాలు, ఐశ్వర్యం, ధాన్యసమృద్ధి కలుగుతాయని భక్తుల విశ్వాసం.ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సిహెచ్. వెంకయ్య చౌదరి, టీటీడీ బోర్డు సభ్యులు సుచిత్ర ఎల్లా, ఎస్వీబీసీ ఛైర్మన్ శ్రీధర్ వర్మ, పలువురు బోర్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

# వాస్తవాలను వెలికితీసి.. వ్యవస్థలను గాడిలో పెట్టాలి

**జర్నలిస్టుల పాత్ర కీలకం.. ప్రజల్లో అవగాహన కల్పించే కథనాలకు ప్రాధాన్యం ఇవ్వాలి**

**ఏపీయూఎస్‌జే 27వ మహాసభలో విజయనగరం ఎస్పీ దామోదర్**



విజయనగరం(ప్రశ్న న్యూస్) ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు వాస్తవాలను వెలికితీసి వ్యవస్థలను సన్మార్గంలో నడిపించడంలో జర్నలిస్టుల పాత్ర ఎనలేనిదని విజయనగరం జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్ అన్నారు. నేరాల నియంత్రణ, ప్రజల భద్రత, సామాజిక సమస్యలపై అవగాహన కల్పించే కథనాలకు మీడియా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.విజయనగరం జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన 27వ ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ వార్షిక మహాసభకు ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో ప్రజలను చైతన్యవంతం చేయడంలో మీడియా కీలక పాత్ర పోషించిందన్నారు.

### స్వాతంత్ర్య పోరాటంలోనూ కీలక పాత్ర

దేశానికి స్వాతంత్ర్యం సాధించే సమయంలో పత్రికలు ప్రజల్లో దేశభక్తిని నింపుతూ, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచాయని ఎస్పీ గుర్తుచేశారు. ఆ కాలంలో పలువురు పాత్రికేయులు దేశం కోసం జైలుకు వెళ్లేందుకు, ప్రాణత్యాగానికి సైతం వెనుకాడలేదన్నారు.
అదే స్ఫూర్తితో ప్రస్తుత కాలంలోనూ ప్రజా సమస్యలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలను వెలుగులోకి తీసుకురావడంలో మీడియా తన బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. వార్తలు, కథనాల ద్వారా అధికారుల దృష్టికి సమస్యలను తీసుకువచ్చి పరిష్కారానికి దోహదపడాలని చెప్పారు.

### గంజాయి.. బెట్టింగ్‌పై చైతన్యం

గంజాయి, మాదకద్రవ్యాలు, మద్యం, బెట్టింగ్ వంటి వ్యసనాల వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించే కథనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్పీ సూచించారు.
ముఖ్యంగా యువత ఈ వ్యసనాలకు బలికాకుండా అవగాహన కల్పించడంలో మీడియా తన వంతు పాత్ర పోషించాలన్నారు. మహిళలు, చిన్నారుల భద్రత, రహదారి భద్రత వంటి అంశాలపై కూడా ప్రజలకు అర్థమయ్యే రీతిలో కథనాలు అందించాలని కోరారు. వివిధ రకాల నేరాలు ఎలా జరుగుతున్నాయో ప్రజలకు వివరించి, వాటి బారిన పడకుండా అప్రమత్తం చేయాలని చెప్పారు.

### వార్తకు ముందు.. వాస్తవ నిర్ధారణ

ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్, డిజిటల్ మీడియా ద్వారా ప్రజలకు విస్తృతంగా సమాచారం చేరుతోందని ఎస్పీ అన్నారు. అయితే ఏ వార్తను ప్రచురించే ముందు వాస్తవాలను ఒకటికి రెండుసార్లు నిర్ధారించుకోవాలని సూచించారు. వాస్తవాధారిత జర్నలిజం ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతుందని పేర్కొన్నారు. నేరరహిత సమాజ నిర్మాణానికి పోలీసులతో కలిసి జర్నలిస్టులు పనిచేయాలని, ప్రజలను అప్రమత్తం చేయడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

### మీడియాపై దాడులను సహించం

జర్నలిస్టులపై దాడుల నియంత్రణకు పోలీసుశాఖ కట్టుబడి ఉందని ఎస్పీ స్పష్టం చేశారు. మీడియా ప్రతినిధులపై దాడులకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టులకు త్వరలో క్యూఆర్ కోడ్‌తో కూడిన వెహికల్ పాస్‌లు అందజేస్తామని తెలిపారు.

### ఎస్పీకి సన్మానం

ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్‌ను శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, APUWJ రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, వివిధ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దసరా వేళ.. కొత్త రంగుల్లో ఇంద్రకీలాద్రి

**- శరన్నవరాత్రులకు ముస్తాబవుతున్న దుర్గమ్మ ఆలయం**

**- అమ్మవారి సన్నిధిలో రంగులద్దే పనులు ముమ్మరం**





విజయవాడ(ప్రశ్న న్యూస్) శరన్నవరాత్రి దసరా మహోత్సవాలకు ఇంద్రకీలాద్రి ముస్తాబవుతోంది. విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో దసరా ఉత్సవాల నేపథ్యంలో ఆలయానికి కొత్త శోభ తీసుకొచ్చేలా రంగులు వేసే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఆలయ గోపురాలు, ప్రాకారాలు, పరిసర ప్రాంతాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు సిబ్బంది పనుల్లో నిమగ్నమయ్యారు. దసరా ఉత్సవాలకు ఏటా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివస్తుంటారు. భక్తుల రాకకు ముందుగానే ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు దేవస్థానం ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా రంగులు వేసే పనులకు ప్రాధాన్యమిచ్చింది.

### కొత్త రంగులతో సరికొత్త శోభ

ఆలయ భవనాలు, గోడలు, ప్రాకారాలు తదితర ప్రాంతాల్లో అవసరమైన చోట్ల రంగులు వేస్తున్నారు. పాత రంగులు వెలిసిన ప్రాంతాలను గుర్తించి వాటికి కొత్త రంగులు అద్దుతున్నారు. రంగుల పనులతో ఇంద్రకీలాద్రి క్రమంగా సరికొత్త రూపును సంతరించుకుంటోంది. దసరా మహోత్సవాల్లో అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణంతోపాటు చక్కటి పరిసరాలు కనిపించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ పరిసరాల్లో ఎక్కడా అసౌకర్యం కలగకుండా పనులను దశలవారీగా చేపడుతున్నారు.

### ఉత్సవాల నాటికి పూర్తికి కసరత్తు

దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యే నాటికి రంగులు వేసే పనులను పూర్తిచేసేలా సిబ్బంది చర్యలు చేపడుతున్నారు. పగలు, రాత్రి పనులను పర్యవేక్షిస్తూ అవసరమైన ప్రాంతాల్లో పనులను వేగవంతం చేస్తున్నారు. ఆలయ పరిసరాల్లో భక్తుల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటూ పనులు నిర్వహిస్తున్నారు. రంగులు వేయడంతో పాటు ఆలయ పరిసరాల పరిశుభ్రత, ఇతర నిర్వహణ పనులను కూడా సమన్వయంతో చేపడుతున్నారు. దసరా మహోత్సవాల సందర్భంగా ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ పెరిగే నేపథ్యంలో అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తిచేసే దిశగా దేవస్థానం అధికారులు దృష్టి సారించారు. దసరా వేళ కొండపై కొలువైన కనకదుర్గమ్మ సన్నిధి మరింత కొత్త శోభను సంతరించుకోనుంది. రంగులద్దే పనులు పూర్తయితే ఇంద్రకీలాద్రి ఆలయ ప్రాంగణం ఉత్సవ శోభతో కళకళలాడనుంది.

# ఒక్కో మంచంపై ఇద్దరా

**- సాలూరు ఆసుపత్రిలో పరిస్థితిపై మంత్రి సంధ్యారాణి ఆవేదన**

**- తండ్రి జ్ఞాపకార్థం 10 పడకలు ఇస్తానని ప్రకటన.. స్పందించిన దాతలు**



సాలూరు(ప్రశ్న న్యూస్) సాలూరు 100 పడకల ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక్కో మంచంపై ఇద్దరు రోగులు చికిత్స పొందుతున్న దృశ్యాలను చూసి రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు వైద్యం అందించే ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాల కొరత ఉండకూడదని స్పష్టం చేశారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు, అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆదివారం సాలూరు ప్రాంతీయ ఆసుపత్రిని మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ వార్డులను సందర్శించి రోగులతో మాట్లాడారు. వైద్యులు అందిస్తున్న సేవలు, మందుల లభ్యత, ఆసుపత్రిలోని సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొన్ని వార్డుల్లో ఒక్కో మంచంపై ఇద్దరు రోగులు చికిత్స పొందుతున్న పరిస్థితిని గమనించారు.

### తండ్రి పేరుతో 10 పడకలు

రోగులకు ఇబ్బంది కలగకుండా అదనపు పడకల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన పీ4 విధానంలో భాగంగా తన తండ్రి, మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ జన్ని ముత్యాలు పేరు మీద ఆసుపత్రికి 10 పడకలు విరాళంగా అందిస్తానని సంధ్యారాణి ప్రకటించారు.మంత్రి ప్రకటనకు పలువురు దాతలు స్పందించారు. ఇందుపూరి నారాయణరావు 10 పడకలు, మాజీ మార్కెటింగ్ ఛైర్మన్ కేతిరెడ్డి చంద్రరావు 5 పడకలు అందించేందుకు ముందుకొచ్చారు. సాలూరుకు చెందిన వైద్యుడు డాక్టర్ గణేశ్వరరావు ప్రాణదాత ట్రస్ట్ ద్వారా మరో 10 పడకలు అందించేందుకు ముందుకొచ్చారు. పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు దాతలు చూపిన చొరవను మంత్రి అభినందించారు.

### పేదల ఆరోగ్యమే ప్రాధాన్యం

ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యసేవల నాణ్యతను మరింత పెంచాలని సంధ్యారాణి సూచించారు. పేదల ఆరోగ్య రక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని వైద్యారోగ్యశాఖ అధికారులు, వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు.వైద్యులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు, క్షేత్రస్థాయి ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలని చెప్పారు. ప్రజలకు అవసరమైన వైద్యసేవలు వేగంగా, నాణ్యంగా అందేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.



### గర్భిణీలు.. విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులకు అందుతున్న వైద్యసేవలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి ఆదేశించారు. ముఖ్యంగా గర్భిణీలకు అవసరమైన వైద్య పరీక్షలను సకాలంలో నిర్వహించి, ఆరోగ్య వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని సూచించారు. హాస్టల్ విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య పరిస్థితిపై పూర్తి వివరాలు సేకరించాలని తెలిపారు. హెచ్ఐవీతోపాటు దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. పాముకాటు, కుక్కకాటు ఘటనల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తక్షణ వైద్యసేవలపై గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం మరింత పెరిగేలా వైద్యారోగ్యశాఖ పనిచేయాలని.. పేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి సంధ్యారాణి స్పష్టం చేశారు.

# ప్రజా భద్రత ప్రభుత్వానికి పట్టదా.?

## -ప్రజల ప్రాణాలతో చెలగాటమా

- ఒకే ప్రాంగణంలో ఫుడ్ ప్రాసెసింగ్.. వాటర్ ప్లాంట్.. కెమికల్ ఫ్యాక్టరీ
- మూడు రకాల కార్యకలాపాలు.. పర్యవేక్షణ మాత్రం ఎక్కడ.?
- అధికారులకు తెలియకుండానే నడుస్తున్నాయా.?

తెలిసి కూడా పట్టించుకోవడం లేదా.?





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్‌మెట్: ప్రజల ఆరోగ్యం, ఆహార భద్రత, తాగునీటి నాణ్యత, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన ప్రభుత్వ వ్యవస్థలో పర్యవేక్షణ లోపిస్తే దాని ప్రభావం నేరుగా ప్రజలపై పడే ప్రమాదం ఉంటుంది. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తుర్రూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ .357లో ఒకే ప్రాంగణంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, వాటర్ ప్లాంట్, కెమికల్/వ్యవసాయ ఇన్‌పుట్ కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు కనిపిస్తున్న నేపథ్యంలో ఇంతటి భిన్న స్వభావం కలిగిన మూడు కార్యకలాపాలు ఒకే ప్రాంగణంలో ఎలా కొనసాగుతున్నాయి, వాటికి అవసరమైన అనుమతులు ఉన్నాయా, సంబంధిత శాఖలు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాయా అన్న ప్రశ్నలు ఇప్పుడు తీవ్రంగా చర్చనీయాంశంగా మారాయి.

### ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్.. అధికారులకు తెలియదా.?

ఒకే ప్రాంగణంలో ఫుడ్ ప్రాసెసింగ్‌కు సంబంధించిన కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు కనిపిస్తున్న నేపథ్యంలో ఆహార భద్రతకు సంబంధించిన నిబంధనలు ఎంతవరకు అమలవుతున్నాయన్నది ప్రధాన ప్రశ్నగా మారింది. ఆహార పదార్థాల తయారీ, ప్రాసెసింగ్ లేదా ప్యాకింగ్ జరుగుతున్నట్లయితే సంబంధిత ఫుడ్ సేఫ్టీ అనుమతులు, లైసెన్సులు, పరిశుభ్రత ప్రమాణాలు, ముడి పదార్థాల నిల్వ, తయారీ ప్రాంతం పరిస్థితులు, ఉపయోగిస్తున్న నీటి నాణ్యత, తయారైన ఆహార పదార్థాల నిల్వ తదితర అంశాలను సంబంధిత అధికారులు పరిశీలించాల్సి ఉంటుంది. మరి ఈ యూనిట్‌పై ఫుడ్ సేఫ్టీ అధికారులు ఎప్పుడైనా క్షేత్రస్థాయి తనిఖీ నిర్వహించారా, నిర్వహించి ఉంటే అక్కడి పరిస్థితులను రికార్డు చేశారా, నీటి నమూనాలు లేదా ఆహార నమూనాలు సేకరించి పరీక్షించారా, నిబంధనలకు అనుగుణంగా లైసెన్సులు ఉన్నాయా అన్నది ఇప్పుడు అధికారికంగా వెల్లడించాల్సిన అవసరం ఉంది. ఇంతటి కార్యకలాపాలు కొనసాగుతున్నా సంబంధిత ఫుడ్ సేఫ్టీ అధికారులకు తెలియకపోతే వారి పర్యవేక్షణ వ్యవస్థపై ప్రశ్నలు తలెత్తడం సహజమేనని స్థానికులు అంటున్నారు.

### వాటర్ ప్లాంట్.. నీటి భద్రతకు హామీ ఎవరిది.?

ఇదే ప్రాంగణంలో వాటర్ ప్లాంట్ కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు కనిపించడం మరింత ఆందోళన కలిగించే అంశంగా మారింది. ప్రజల వినియోగానికి వెళ్లే నీటికి సంబంధించి నాణ్యత, పరిశుభ్రత, శుద్ధి ప్రక్రియ, నిల్వ, ప్యాకింగ్ వంటి అంశాల్లో ఏమాత్రం నిర్లక్ష్యం జరిగినా దాని ప్రభావం వినియోగదారుల ఆరోగ్యంపై పడే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో వాటర్ ప్లాంట్‌కు అవసరమైన అనుమతులు ఉన్నాయా, ప్లాంట్‌లోకి వచ్చే నీటి మూలం ఏమిటి, శుద్ధి అనంతరం నీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పరీక్షిస్తున్నారా, సంబంధిత అధికారులు నీటి నమూనాలను సేకరించి పరీక్షించారా, పరీక్షలు జరిగితే వాటి ఫలితాలు ఏమిటి అన్నది స్పష్టమవ్వాల్సి ఉంది. ముఖ్యంగా అదే ప్రాంగణంలో కెమికల్ కార్యకలాపాలు కూడా కొనసాగుతున్నట్లు కనిపిస్తున్న పరిస్థితిలో నీటి ప్లాంట్‌కు సంబంధించి భద్రతా ప్రమాణాలను అధికారులు ప్రత్యేకంగా పరిశీలించారా లేదా అన్నది అత్యంత కీలకమైన అంశంగా మారింది. ప్రజలు తాగే నీటి భద్రతకు సంబంధించిన వ్యవహారం కావడంతో అధికారులు దీనిపై మౌనం వహించకుండా వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది.

### కెమికల్ ఫ్యాక్టరీ.. వ్యవసాయ శాఖ పర్యవేక్షణ ఎక్కడ.?

ఇక ఇదే ప్రాంగణంలో కెమికల్ లేదా వ్యవసాయ ఇన్‌పుట్‌లకు సంబంధించిన కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు కనిపిస్తున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖతో పాటు సంబంధిత అధికారులు చేపట్టిన పర్యవేక్షణపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కేవీర్ అగ్రి సైన్సస్ పేరుతో ఉన్న బోర్డు, అక్కడ కనిపిస్తున్న కార్యకలాపాల నేపథ్యంలో సంబంధిత అగ్రికల్చర్ అధికారులు, ఏడీఏ స్థాయి అధికారులు ఈ యూనిట్‌ను ఎప్పుడైనా పరిశీలించారా, ఏ ఉత్పత్తులు తయారు చేస్తున్నారు, ఏ ముడి పదార్థాలు ఉపయోగిస్తున్నారు,




వాటిని ఎలా నిల్వ చేస్తున్నారు, యూనిట్‌కు ఏ అనుమతులు ఉన్నాయి, అనుమతులు మంజూరు చేసే ముందు స్థల పరిశీలన జరిగిందా అన్నది అధికారిక రికార్డుల ద్వారా తేలాల్సి ఉంది. అదే విధంగా సంబంధిత హెచ్-ఫాస్ అధికారులు తమ పరిధిలో తనిఖీలు నిర్వహించారా, ఉత్పత్తుల నాణ్యత, నిల్వ, భద్రతా ప్రమాణాలను పరిశీలించారా అన్నది కూడా స్పష్టం కావాలి. కెమికల్ సంబంధిత కార్యకలాపాలు జరిగే ప్రాంగణంలోనే ఫుడ్ ప్రాసెసింగ్, వాటర్ ప్లాంట్ కూడా ఉన్నందున మూడు కార్యకలాపాల మధ్య భద్రతా ప్రమాణాలు, వేర్వేరు నిల్వ ప్రాంతాలు, వ్యర్థాల నిర్వహణ, కలుషిత ప్రమాదాల నివారణ వంటి అంశాలపై సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలన చేశారా అన్నది ఇప్పుడు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉంది.

### ఒకే ప్రాంగణం.. మూడు కార్యకలాపాలు.. అధికారుల పర్యవేక్షణ ఏది?

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, వాటర్ ప్లాంట్, కెమికల్/అగ్రి ఇన్‌పుట్ యూనిట్ ఒకే ప్రాంగణంలో కొనసాగుతున్నట్లు కనిపిస్తున్నప్పుడు.. ఒక్కో యూనిట్‌కు సంబంధించిన శాఖలు తమ తమ పరిధిలో మాత్రమే కాకుండా సమన్వయంతో మొత్తం ప్రాంగణాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆహార భద్రతను, సంబంధిత అగ్రికల్చర్ మరియు ఏడీఏ అధికారులు వ్యవసాయ ఉత్పత్తుల కార్యకలాపాలను, హెచ్-ఫాస్ అధికారులు తమ పరిధిలోని నాణ్యతా ప్రమాణాలను, నీటి సంబంధిత అధికారులు వాటర్ ప్లాంట్ నాణ్యతను, కాలుష్య నియంత్రణ అధికారులు పర్యావరణ అంశాలను, రెవెన్యూ మరియు స్థానిక సంస్థలు భూమి వినియోగం, నిర్మాణాలు, స్థానిక అనుమతులను పరిశీలించాల్సి ఉంటుంది. అయితే ఇన్ని విభాగాల పరిధికి సంబంధించిన కార్యకలాపాలు ఒకే ప్రాంగణంలో కనిపిస్తున్నప్పటికీ వాటిపై సమగ్ర తనిఖీలు జరిగాయా లేదా అన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్న.

### వ్యవసాయ భూముల్లో భారీ షెడ్లు.. అనుమతులు ఉన్నాయా.?

ఇదే సమయంలో వ్యవసాయ భూముల్లో భారీ షెడ్లు నిర్మించి ఇలాంటి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలపైనా అధికారులు దృష్టి సారించాల్సి ఉంది. షెడ్ల నిర్మాణానికి అవసరమైన అనుమతులు ఉన్నాయా, భూమి వినియోగానికి సంబంధించి అనుమతులు తీసుకున్నారా, నిర్మాణాలు అనుమతించిన ప్లాన్ ప్రకారమే జరిగాయా, పారిశ్రామిక లేదా వాణిజ్య కార్యకలాపాలకు అవసరమైన అనుమతులు ఉన్నాయా అన్నది రెవెన్యూ, స్థానిక సంస్థలు, సంబంధిత శాఖల రికార్డులను పరిశీలిస్తేనే స్పష్టమవుతుంది. ఒకవేళ అన్ని అనుమతులు నిబంధనల ప్రకారమే ఉన్నట్లయితే అధికారులు వాటిని వెల్లడించడంలో ఎలాంటి సందేహం ఉండాల్సిన అవసరం లేదు.

### మీడియా సంస్థ పేరు వినియోగంపై కూడా స్పష్టత అవసరం

ఈ వ్యవహారంలో స్థానికంగా ఒక వార్తా దినపత్రిక సంస్థకు ఎల్బీనగర్ జోన్ రిపోర్టర్/ఇన్‌చార్జ్‌గా రజినీకాంత్ రెడ్డి పేరు ప్రస్తావనకు వస్తున్న నేపథ్యంలో.. ఆయనకు సర్వే నంబర్.357లోని భూమి, షెడ్లు లేదా అక్కడ కొనసాగుతున్న యూనిట్లతో ఏదైనా సంబంధం ఉందా అన్నది పత్రాల ఆధారంగా స్పష్టం కావాల్సి ఉంది. అలాగే ఏదైనా మీడియా సంస్థ పేరు వ్యక్తిగత లేదా వ్యాపార కార్యకలాపాలకు ఉపయోగిస్తున్నారన్న ఆరోపణలు ఉంటే.. సంబంధిత వ్యక్తి వివరణతో పాటు ఆ మీడియా సంస్థ యాజమాన్యం వైపు నుంచి కూడా స్పష్టత రావాల్సిన అవసరం ఉంది. ఈ కథనంలో ప్రస్తావించిన ఆరోపణలు, సందేహాలపై రజినీకాంత్ రెడ్డి వివరణను వార్త సంధ్య కోరుతోంది. ఆయన వివరణ అందిన వెంటనే అదే ప్రాధాన్యంతో ప్రచురించడానికి వార్త సంధ్య సిద్ధంగా ఉంది.

### ప్రజా భద్రత ప్రభుత్వానికి పట్టదా?

ప్రజలు తినే ఆహారం ఒకే ప్రాంగణంలో తయారవుతోంది.. ప్రజలు తాగే నీరు అదే ప్రాంగణంలో శుద్ధి అవుతోంది.. అదే ప్రాంగణంలో కెమికల్ లేదా వ్యవసాయ ఇన్‌పుట్‌లకు సంబంధించిన కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు కనిపిస్తోంది. ఈ మూడు కార్యకలాపాల మధ్య అవసరమైన భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అన్నది కేవలం ఒక వ్యక్తి లేదా ఒక సంస్థకు సంబంధించిన ప్రశ్న కాదు..

ఇది నేరుగా ప్రజల ఆరోగ్యం, ప్రజల భద్రతకు సంబంధించిన అంశం. ఇలాంటి పరిస్థితుల్లో సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెల్లడించాల్సిన బాధ్యత ఉంది. అధికారులకు తెలియకుండానే ఇంతటి కార్యకలాపాలు కొనసాగుతున్నాయంటే ప్రభుత్వ పర్యవేక్షణ వ్యవస్థ ఎక్కడ పనిచేస్తోంది అన్న ప్రశ్న తలెత్తుతుంది. తెలిసి కూడా తనిఖీలు, చర్యలు లేకపోతే మరింత తీవ్రమైన ప్రశ్నలు ఎదురవుతాయి. అనుమతులు ఉంటే ప్రజల ముందు పెట్టాలి.. నిబంధనల ప్రకారమే కార్యకలాపాలు కొనసాగుతున్నాయని అధికారులు స్పష్టం చేయాలి. ఉల్లంఘనలు ఉంటే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

---

## ఇంద్రకీలాద్రిపై సోనూసూద్..

# దుర్గమ్మ దర్శనం

### అమ్మవారి సన్నిధిలో ప్రముఖ సినీ నటుడు సోను సూద్




విజయవాడ(ప్రశ్న న్యూస్) ప్రముఖ సినీ నటుడు సోనూసూద్ విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆదివారం ఆలయానికి చేరుకున్న ఆయనకు దేవస్థానం అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.
అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్న సోనూసూద్‌కు అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు. అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనకు అమ్మవారి చిత్రపటాన్ని అందించి సత్కరించారు.సోనూసూద్ అమ్మవారిని దర్శించుకున్న విషయం తెలుసుకున్న పలువురు భక్తులు ఆయనను చూసేందుకు ఆసక్తి చూపించారు. కొందరు అభిమానులు సెల్ఫీలు తీసుకునేందుకు ప్రయత్నించారు. దీంతో ఆలయ పరిసరాల్లో కొద్దిసేపు సందడి నెలకొంది.

---

## మనవాళ్లు చైనాకు పట్టుబడ్డప్పుడు

# నా పనైపోయిందనుకున్నా



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్),** జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ తన ఉద్యోగ జీవితం తొలినాళ్లలో ఎదురైన ఓ క్లిష్టమైన సంఘటనను గుర్తుచేసుకున్నారు. చైనా సైన్యం తన బృందాన్ని అదుపులోకి తీసుకున్నప్పుడు, ఇక తన పనైపోయిందన్న ఆందోళనకు గురయ్యానని ఆయన వెల్లడించారు. ఐఐటీ రూర్కీ స్నాతకోత్సవంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించిన ఆయన, ఈ ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నారు. సిక్కిం భారత్‌లో విలీనమవుతున్న సమయంలో తాను యువ ఐపీఎస్ అధికారిగా అక్కడ ఇంటెలిజెన్స్ బాధ్యతలు చూసేవాడినని దోవల్ తెలిపారు. సరిహద్దుల్లో చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్‌ఏ) కదలికలపై నిఘా పెట్టడం తన విధుల్లో భాగమని చెప్పారు. ఆ క్రమంలో, సరిహద్దు ప్రాంతంలో నిఘా కోసం ఒక బృందాన్ని పంపానని, వారు సుమారు 8 రోజుల్లో తిరిగి రావాల్సి ఉందని పేర్కొన్నారు. అయితే, రోజులు గడుస్తున్నా వారి నుంచి ఎలాంటి సమాచారం రాలేదని దోవల్ వివరించారు. "5 రోజులు, 10 రోజులు, 15 రోజులు గడిచినా వారి ఆచూకీ తెలియలేదు. హిమపాతం వంటి ప్రమాదాలు జరిగినట్లు కూడా ఎక్కడా సమాచారం లేదు. దీంతో వృత్తిపరంగా, మానవతా దృక్పథంతో తీవ్ర ఆందోళనకు గురయ్యాను" అని అన్నారు. కొన్ని రోజుల తర్వాత హెడ్ క్వార్టర్స్ నుంచి ఫోన్ వచ్చిందని, తాను పంపిన బృందం చైనా కస్టడీలో ఉందని ఉన్నతాధికారి చెప్పినప్పుడు మరింత ఆందోళన చెందానని తెలిపారు.చర్చల అనంతరం చైనా ఆ బృందాన్ని తిరిగి భారత్‌కు అప్పగించిందని దోవల్ చెప్పారు. "కానీ, వారు తిరిగి వచ్చినప్పుడు మానసికంగా, శారీరకంగా పూర్తిగా కుంగిపోయి ఉన్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై విచారణ ప్రారంభం కావడంతో, చిన్న వయసులోనే తన కెరీర్ ముగిసిపోయిందని, మరో కొత్త ఉద్యోగం చూసుకోవాలని భావించినట్లు ఆయన గుర్తుచేసుకున్నారు.అయితే, విచారణలో అసలు వాస్తవం బయటపడింది. తన బృందానికి హెడ్ క్వార్టర్స్ నుంచి అందించిన మ్యాపులు, స్కెచ్‌లలో లోపాలు ఉన్నాయని, ఆ తప్పిదం కారణంగానే వారు దారి తప్పి చైనా భూభాగంలోకి వెళ్లారని తేలింది. దీంతో ఈ ఘటనలో తన తప్పేమీ లేదని నిరూపితమైనట్లు దోవల్ తన పాత జ్ఞాపకాలను పంచుకున్నారు.

---

# విత్తన కంపెనీ చేతిలో ఆదివాసీ రైతుల నిలువు మోసం

### 12 క్వింటాళ్ల దిగుబడి, క్వింటాకు రూ.12 వేలంటూ నమ్మించి లక్షల్లో మోసం

### ములుగులో కల్తీ విత్తనాల కంపెనీలకు సహకరించిన అగ్రికల్చర్ అధికారులు



ములుగు (ప్రశ్నన్యూస్) ఏటూరు నాగారాం అడవి బిడ్డల అమాయకత్వాన్ని పెట్టుబడిగా చేసుకుని ఓ ప్రైవేట్ విత్తన కంపెనీ లక్షల్లో మోసానికి పాల్పడింది. ఎకరానికి 12 క్వింటాళ్ల దిగుబడి, క్వింటాలుకు రూ.12 వేలు ఇస్తామంటూ ఆశపెట్టి, పంట చేతికొచ్చాక ముఖం చాటేసిన ఘటన ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలంలో వెలుగుచూసింది. ఈ ఘటన గత ఏడాది మే నెలలో జరగ్గా, బాధితులు న్యాయం కోసం ఏడాదిగా తిరుగుతున్నా ఫలితం లేకపోవడంతో తాజాగా ఈ వ్యవహారం బయటకు వచ్చింది.

### శివాపూర్ లోనే మోసానికి తెరలేపిన కంపెనీ

ఏటూరు నాగారం మండలం శివాపూర్ గ్రామానికి చెందిన 10 మందికి పైగా ఆదివాసీ రైతులు ఈ మోసంలో బాధితులుగా మిగిలారు. ఖూ =ఎ ాూస్త్రతీవవ ాావవఎం కంపెనీ పేరుతో ఆర్గనైజర్ తోట రాజు, సబ్ ఆర్గనైజర్ మదారి సంపత్ గ్రామంలోకి వచ్చారు. రైతులతో సమావేశాలు నిర్వహించారు. తమ కంపెనీ విత్తనాలు వేస్తే అధిక దిగుబడి వస్తుందని, మార్కెట్లో లేని విధంగా క్వింటాకు రూ.12 వేల ధర చెల్లిస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారి మాటలు నమ్మిన రైతులు అప్పులు చేసి మరీ పంట సాగు చేశారు.




### నమ్మించి నట్టేట ముంచారు.

రైతులు పంటను కళ్లల్లో పెట్టుకుని కాపాడుకుని చేతికి తెచ్చారు. కానీ కొనుగోలు సమయానికి కంపెనీ తీరు పూర్తిగా మారిపోయింది. దిగుబడి తక్కువ వచ్చిందని, అనుకున్న నాణ్యత లేదని సాకులు చెబుతూ చెప్పిన ధర ఇవ్వకుండా మొండికేసింది. కొంతమంది రైతులకు అసలు డబ్బులే ఇవ్వకుండా తిప్పించుకుంటోంది. ఈ విషయంపై రైతులు ఆర్గనైజర్ తోట రాజును ప్రశ్నిస్తే, సబ్ ఆర్గనైజర్ మదారి సంపత్ దే తప్పు అని, మదారి సంపత్ ను అడిగితే తోట రాజే బాధ్యుడని చెప్పుకుంటూ ఇద్దరూ తప్పించుకుంటున్నారని బాధితులు చెబుతున్నారు.

### మంత్రి సీతక్కను కలిసినా దక్కని న్యాయం:

తమకు జరిగిన అన్యాయంపై బాధిత రైతులు ఏకంగా జిల్లా మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందజేశారు. అయినా నెలలు గడుస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదని, కంపెనీపై కేసు నమోదు చేయలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో విసిగిపోయిన రైతులు తాజాగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమకు రావాల్సిన బకాయిలు ఇప్పించి, మోసానికి పాల్పడిన US RH Agree Seeds కంపెనీ నిర్వాహకులపై, ఆర్గనైజర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గిరిజన ప్రాంతాల్లోని రైతులకు వ్యవసాయంపై సరైన అవగాహన లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని కొన్ని ప్రైవేట్ కంపెనీలు ఇలా మోసాలకు పాల్పడుతున్నాయని, వ్యవసాయ శాఖ అధికారులు ఇలాంటి కంపెనీలపై నిఘా పెట్టి, అమాయక రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588